అరుంధతీ రాయ్‌కి అమెరికా బుక్ క్రిటిక్స్ అవార్డు





2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 29 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 82 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



ఈవీ సబ్సిడీల జూలై 31 వరకు పొందొచ్చు





2

### ఈశ్వరుడి ఆశీర్వాదంతో మూసీ ప్రక్షాళన చేసి తీరుతం

# అడ్డుకుంటే శివతాండవమే

## ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష

ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేస్తం

గతంలో ఎంతో మంది ప్రయత్నించినా సక్సెస్ కాలేదు

మానవ తప్పిదాలను సరిదిద్దకుంటే చరిత్ర మనల్ని క్షమించదు

సబితక్కా.. మీ పుత్రరత్నం ఎన్జీటీలో వేసిన కేసు వెనక్కి తీసుకోవాలే

ప్రజల కష్టాలు చూడలేని వారు రాయికంటే కఠినాత్ములు

మంచిరేవుల వద్ద ఓంకారేశ్వరాలయ

శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మార్చి 28 (మనం బ్యూరో):** ఈశ్వరుడి ఆశీర్వాదంతో మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతం. ఎవరైనా అడ్డుపడితే రాష్ట్ర ప్రభుత్వం శివతాండం చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మానవ తప్పిదాలను ప్రభుత్వాలు అరికట్టాలి. లేదంటే భావితరాలు నష్టపోతాయని పేర్కొన్నారు. శనివారం మంచిరేవులలో మూసీ నదీ తీరాన మచిలేశ్వరస్వామి, ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయం పునర్నిర్మాణానికి వేద పండితుల మంత్రోచ్ఛారణలు,శంఖునాదాల మధ్య భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం సీఎం దంపతులు మచిలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని అంటారనీ, ఒక చారిత్రక మందిరాన్ని నిర్మించుకోవడం చారిత్రక సందర్భంగా పేర్కొన్నారు. 8 ఎకరాల్లో రూ.700 కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామనీ, ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉందనీ, చరిత్ర మరుగున పడకుండా భవిష్యత్ తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. మూసీ నది పునరుజ్జీవానికి చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏమైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం దక్కడం మా అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. విమర్శలు వచ్చినా అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడనీ, చరిత్రను గమనిస్తే నదీ పరీవాహక ప్రాంతంలోనే నాగరికత అభివృద్ధి చెందిందనీ, దేశంలో సముద్రపు ఒడ్డు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని పేర్కొన్నారు. మూసీ పరివాహకంలో మత సామరస్యానికి చిహ్నంగా పురానాపూల్‌లో మసీదు, నాగోల్ ప్రాంతంలో చర్చిని, గౌలిగూడలో గురుద్వారాను నిర్మించనున్నట్లు వెల్లడించారు. 20 టీఎంసీల గోదావరి జలాలను మూసీకి తరలించి నిరంతరం నీరు పారేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, ఆ ప్రజల కష్టాలు చూడలేని వారు రాయికంటే కఠినాత్ములను వ్యాఖ్యానించారు. మానవ తప్పిదాలను సరిదిద్దకపోతే చరిత్ర మనల్ని క్షమించదనీ, మూసీ పరీవాహక ప్రజా ప్రతినిధులు మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తున్నరని స్పష్టం చేశారు. తాము

...మిగతా 2లో

### అక్రమ మైనింగ్, ఇసుక మాఫియాపై సీఐడీ విచారణ జరిపిస్తం

అసెంబ్లీలో సీఎం ప్రకటన

సంతోష్ రావు, గంగుల, వద్దిరాజు మైనింగ్‌పైనా విచారణ

హరీష్ రావు తమ్ముడు ఇసుక మాఫియా నడిపిండు

2



## నేత్రపర్వం.. ఆధ్యాత్మికానందం

### శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

కనులారా తిలకించిన గవర్నర్ శుక్లా దంపతులు



**భద్రాచలం, మార్చి 28 (మనం న్యూస్):** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మిథిలా ప్రాంగణంలో శనివారం అత్యంత వైభవంగా జరిగిన, ఈ మహోత్సవంలో దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక

...మిగతా 2లో



3

### అంగన్ వాడీ చిన్నారులకు తొలిముద్ద

బ్రేక్‌ఫాస్ట్‌లో ఉప్మా, కిచిడీ అందించనున్న ప్రభుత్వం

అసెంబ్లీ ప్రాంగణంలో ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీస్

## దేశంలోనే నెం.1

హోం శాఖ సేవలు అద్భుతం

శాసన సభలో ప్రకటించిన

మంత్రి పొన్నం ప్రభాకర్

2

# ‘మెట్రో’ స్వాధీనానికి అసెంబ్లీ ఆమోదం

### తీర్మానం ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి

### క్యూర్ పరిధి వరకు విస్తరిస్తామని ప్రకటన




**హైదరాబాద్, మార్చి 28 (మనం బ్యూరో):** విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)కు మెట్రో రైల్‌ను విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ వర్గాల నుంచి వచ్చిన డిమాండ్ వరకు ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం లోతుగా సమీక్షించింది. ప్రస్తుతం ఉన్న మెట్రో ఫేజ్ 1 మొత్తం 69 కి.మీ.లు ఉంది. ఫేజ్ 2(ఏ) 76.4 కి.మీ., ఫేజ్ 2 (బీ) 86.1 కి.మీ.ల మేర విస్తరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పరిస్థితిని సభ ముందు ఉంచింది. ఫేజ్ 1 ప్రైవేట్ నిర్వహణలో ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్-2, ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఎదురవుతున్న సాంకేతిక, చట్టపరమైన, నిర్వహణ సమస్యలను దృష్టిలోకి తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎల్అండ్‌టి సంస్థ నుండి మెట్రో ఫేజ్ 1 నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభత్వం హెచ్ఎంఆర్ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయాన్ని అసెంబ్లీ ఆమోదించింది. అందువల్ల మెట్రో ఫేజ్ 1 స్వాధీనం చేసుకునే ప్రక్రియకు రాష్ట్ర ప్రభత్వం తీసుకున్న నిర్ణయాలను గౌరవ సభ సమర్థించి పూర్తి మద్దతు ప్రకటించింది. ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం త్వరగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలన్న తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించింది.

### ‘పోలీస్ అక్క’కు స్కోచ్ అవార్డు

- ఢిల్లీలో అందుకున్నఎస్పీ జానకీ షర్మిల
- నిర్మల్ జిల్లా ఎస్పీ, సిబ్బందికి డీజీపీ ప్రశంసలు

10





### సచివాలయంలో ఎర్త్ అవర్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేయడానికి గాను నిర్వహించిన Earth Hour లో శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 వరకు రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ దీపాలను పూర్తిగా నిలిపివేశారు. అదేవిధంగా సచివాలయం ప్రధాన భవనంతో పాటు, సచివాలయంలోని వివిధ కార్యాలయ భవనాలు గదులు హాళ్లలోనూ విద్యుద్దీపాలను ఆర్పివేశారు. GiveAnHourForEarth అనే నినాదంతో Earth Hour-2026ను పర్యావరణ పరిరక్షణ చైతన్యం కోసం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు.

# ఎల్లుండే లాస్ట్ డేట్

### ఆపరేషన్ కగార్‌పై 30న లోక్‌సభలో అమిత్ షా ప్రకటన

**ఢిల్లీ, మార్చి 28:** మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ డెడ్లైన్ దగ్గర పడింది. ఈ నెల 31 వరకు భారత్ నుమావోయిస్టు రహిత దేశంగా మార్చుతామంటూ ప్రకటించిన కేంద్రం.. ఈ ఆపరేషన్ ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అయితే మూడు రోజుల్లో గడువు సమీపిస్తున్న వేళ ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల సంగతి ఏంటి? వారు లొంగిపోబోతున్నారా..? లేదా..? అనే సందేహాలు తలెత్తుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మావోయిజాన్ని

...మిగతా 2లో




## ఆరంభ వేడుకలు నిల్.. ముగింపు సంబరాలు ఫుల్



ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ వేడుకలు నిర్వహించకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది తొక్కిసలాటలో చనిపోయిన 11 మంది అభిమానులకు నివాళిగా నల్ల బ్యాడ్జీలతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలో దిగింది. అయితే ఐపీఎల్ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు బీసీసీఐ సెక్రటరీ ప్రకటన చేశారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు, సన్‌రైజర్స్ హైదరాబాద్‌ల మధ్య శనివారం సాయంత్రం 7గంటలకు మొదలైంది.

- మరిన్నివార్తలు 12 లో...

# శాంతి కావాలంటే.. మేం చెప్పినట్టు వినాలె

## గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, మార్చి 28:** తమ పొరుగునున్న గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా.. శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ హెచ్చరించారు. తమ గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు అనుమతి ఇవ్వొద్దని బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలకు ఆయన సూచించారు. తాము ఏ దేశంపైనా ముందస్తు దాడులు చేయబోమని అనేక సార్లు స్పష్టం

...మిగతా 2లో

### గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై విరుచుకు పడ్డ ఇరాన్

2

### హర్మ్యూజ్‌ను దాటిన మన నౌకలు మరో రెండు

**టెహ్రాన్, మార్చి 28:** ఎల్పీజీని తీసుకొస్తున్న మరో రెండు భారత నౌకలు శనివారం హర్మ్యూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 90,000 టన్నులకు పైగా ఎల్పీజీ (వంటగ్యాస్)ని తీసుకువస్తున్న ఈ రెండు నౌకలు హర్మ్యూజ్ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయన్నాయి. మరో ఐదు భారతీయ ట్యాంకర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి ఉన్నట్లు సమాచారమందుతోంది.



## నేపాల్ మాజీ ప్రధాని ఓలీ అరెస్టు

### బాధ్యతలు చేపట్టిన రెండో రోజే ‘యాక్షన్’ మొదలు పెట్టిన జెన్ జీ ప్రభుత్వం

**ఖాట్మండు, మార్చి 28:** నేపాల్ మాజీ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ అరెస్టయ్యారు. గతేడాది దేశంలో జరిగిన జెన్ జీ నిరసనలను హింసాత్మకంగా అణచివేశారనే ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా.. నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం చేసిన మరుసటిరోజే ఈ అరెస్టు జరగడం గమనార్హం. భక్తపుర్లో ఉన్న ఓలీ నివాసం నుంచి పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్ ను కూడా అరెస్టు చేశారు. మాజీ ప్రధాని అరెస్టును కొత్త హోం వ్యవహారాలశాఖ మంత్రి సుడాన్ గురంగ్ సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు. ‘ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. చట్టానికి ఎవరూ అతీతులు కారు.



మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీతో పాటు మాజీ హోం మంత్రి రమేశ్ ను అదుపులోకి తీసుకున్నాం. ఇది ప్రతీకార చర్య కాదు.. న్యాయ ప్రక్రియకు ఆరంభం మాత్రమే’

...మిగతా 2లో

# దేశంలోనే నెం.1

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,మార్చి 28(మనం, ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో శాంతిభద్రతలు అత్యంత సక్రమంగా నిర్వహించబడుతున్నాయని, తెలంగాణ పోలీసుల పనితీరు దేశవ్యాప్తంగా పోలీసు శాఖకు ఆదర్శంగా మారిందని మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో స్పష్టం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి హోం శాఖ బడ్జెట్ డిమాండ్లపై శనివారం జరిగిన చర్చకు మంత్రి పొన్నం సమాధానమిచ్చారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీసుల సమగ్ర పనితీరును ఆయన వివరించారు. రాష్ట్రంలో మతపరమైన పరిస్థితులు పూర్తిగా ప్రశాంతంగా ఉన్నాయని శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, బోనాలు, గణేష్ నిమజ్జనం, రంజాన్, మొహర్రం, మేడారం జాతరలను పోలీసు శాఖ పటిష్ట బందోబస్తుతో విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. వరదల సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వేలాది మందిని రక్షించిన పోలీసుల సేవలు అద్భుతమని కొనియాడారు.

**మావోల లొంగుబాట:**

గడచిన రెండేళ్ల కాలంలో సీంఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారని మంత్రి పొన్నం వివరించారు. ముఖ్యంగా మావోయిస్టు పార్టీ అగ్రనేతలు దేవ్ జి, మల్లా రాజిరెడ్డి,బడే చొక్కారావుతో పాటు అనేక మంది కీలక మావోలు లొంగుబాట పట్టారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పాలనలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు డిజిపి ఎదుట లొంగిపోవడం రాష్ట్రంలో మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతోందన్నారు. లొంగిపోయిన వారిలో ఇతర రాష్ట్రాల వారు కూడా ఉన్నారన్నారు. మొత్తం 509 మంది మావోయిస్టులలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర. ఆంధ్రప్రదేశ్‌లకు చెందినవారున్నారన్నారు.

**కొత్త కమిషనరేట్‌లు:**

రాష్ట్ర రాజధాని విస్తరణకు అనుగుణంగా 'ఫ్యూచర్ సిటీ కమిషనరేట్'ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. సైబర్ నేర బాధితుల కోసం 'సి-మిత్ర' వర్చువల్ హెల్ప్ డెస్క్, మహిళల భద్రత కోసం 'టీ-సేఫ్' యాప్ వంటి వినూత్న సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామన్నారు. మిస్ వరల్డ్ కార్యక్రమం, గ్లోబల్ సమ్మిట్, మెస్సి పాల్గొన్న ఫుట్‌బాల్ మ్యాచ్ వంటి అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు పటిష్ట భద్రత కల్పించామని గుర్తుచేశారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కోసం రూపొందించిన 'వెరీ ఫాస్ట్ యాప్'కు జాతీయ గుర్తింపు లభించిందని శామీర్ పేట పోలీస్ స్టేషన్ దేశంలోనే 7వ ఉత్తమ స్టేషన్‌గా నిలిచిందని ప్రకటించారు.

**పోలీసుల కోసం:**

రాష్ట్ర ఖ్యాతిని దేశ వ్యాప్తంగా చాటిచెప్పిన పోలీసు సిబ్బంది పిల్లల కోసం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ప్రారంభించామని మంత్రి వివరించారు. ఈక్రమంలో 30 వేల మంది పోలీసు సిబ్బందిని గ్రాడ్యుయేట్లుగా మార్చేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కోసం 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని, పర్యాటకుల కోసం కొత్తగా 'టూరిస్ట్ పోలీస్' విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా తెలంగాణ పోలీసుల పనితీరును ప్రశంసించిందని మంత్రి గుర్తు చేశారు.అగ్నిమాపక శాఖను 'తెలంగాణ అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ'గా మారుస్తూ ఆధునీకరించామన్నారు. 147 ఫైర్ స్టేషన్ల ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడామని, భారీ భవనాల కోసం 104 మీటర్ల హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్‌లను సేకరిస్తున్నామని చెప్పారు.

**జైళ్ల శాఖలోనూ:**

రాష్ట్రంలోని జైళ్ల శాఖలో 'మిషన్ పరివర్తన' ద్వారా ఖైదీల సంస్కరణకు పెద్దపీట వేస్తున్నామని, 22 మార్చి నాడు సిద్దిపేటలో నూతన జిల్లా జైలును ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఖైదీల్లో మత్తు అలవాట్లను మాన్పించేందుకు 'నివృత్తి' కేంద్రాలను, చదువుకునే వారి కోసం ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, మాజీ సైనికులు, 100% వైకల్యం కలిగిన సైనికుల సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయించామని మంత్రి తెలియజేశారు. పేద ఖైదీలకు బెయిల్, జరిమానాల చెల్లింపులో సహాయం చేసే పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు


# నేపాల్ మాజీ ప్రధాని ఓలీ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అని రాసుకొచ్చారు. పోలీసులు తీసుకెళ్తుండగా ఓలీ మీడియాతో మాట్లాడుతూ.. ఇది కక్షపూరిత చర్యగా అభివర్ణించారు. దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని వ్యాఖ్యానించారు. గతేడాది సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా నేపాల్లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో 19 మంది యువకులతో సహా 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ తర్వాత తాత్కాలిక ప్రధానిగా సుశీల నియమితులయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో బాలేంద్ర షా నేపాల్ కొత్త ప్రధానిగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన ప్రమాణం చేసిన అనంతరం.. మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో జెన్ జీ ఉద్యమంపై దర్యాప్తు జరిపిన ఉన్నతస్థాయి కమిషన్ సిఫార్సులను తక్షణమే అమలుచేయాలని నిర్ణయించారు. ఆందోళనకారులపై కాల్పులు జరపమని ఆదేశాలు ఉన్నట్లు రుజువు కాలేదని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. అయితే, కాల్పులను ఆపేందుకు కూడా నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రయత్నించలేదని, వారి నిర్లక్ష్యం వల్ల మైనర్లు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. కాగా.. ఆందోళనల సమయంలో నేపాల్ పోలీస్ ఇన్ స్పెక్టర్‌గా ఉన్న చంద్రకుబేర్ ఖాపుంగ్ తో సహా అనేకమంది ఇతర ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. అయితే, నివేదికలోని అంశాలను ఓలీ తిరస్కరించారు. కమిషన్ సిఫార్సు ఆధారంగా కోర్టు విచారణలో వీరు దోషులుగా తేలితే.. 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముండొచ్చు.

# శాంతి కావాలంటే.. మేం చెప్పినట్టు వినాలె

(మొదటి పేజీ తరువాయి)



చేసినట్లు పెజెష్కియాన్ తెలిపారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం చూస్తూ ఊరుకోబోమని.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామన్నారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదలబోమని ఆయన స్పష్టం చేశారు.

# గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై విరుచుకు పడ్డ ఇరాన్

## అగ్రరాజ్య సైనికులకు తీవ్ర గాయాలు.. యుద్ధ విమానాలు ఖతం..

**టెహ్రాన్, మార్చి 28:** పశ్చిమాసియా యుద్ధంపై ఇరు పక్షాలూ పరస్పరం భీకర దాడులను చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్ ప్రతీకార దాడుల్లో భాగంగా సౌదీ అరేబియా, బహ్రెయిన్లోని అమెరికా స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ పై జరిగిన దాడిలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడగా, యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్లోని అనేక ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు స్థానిక అధికారులు తెలియజేశారు. సౌదీ అరేబియా రాజధాని రియాద్ పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను కూల్చివేసినట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. టెహ్రాన్ దాడుల్లో కువైట్‌లోని పలు వాణిజ్య భవనాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఐక్యరాజ్యసమితి అభ్యర్థన మేరకు హర్మూజ్ జలసంధి గుండా మానవతా సాయం, వ్యవసాయ సరకుల రవాణాను అనుమతించడానికి ఇరాన్ సమ్మతించింది.

**ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి...**

సరిగ్గా నెల రోజుల కిందట ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఈ దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాలను ఉత్పత్తి చేసే ప్లాంట్లు, క్షిపణి ప్రయోగకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు రక్షణ మంత్రి కాట్జ్ పేర్కొన్నారు. తమ దాడుల్లో అణ్వాయుధాల ముడి పదార్థాలను శుద్ధి చేసే కర్మాగారాలు ధ్వంసమయ్యాయని.. ఇది టెహ్రాన్ అణు కార్యక్రమానికి పెద్ద దెబ్బ అని ఇజ్రాయెల్ తెలిపింది. దాడులపై ఇరాన్ స్పందిస్తూ.. టెల్ అవీవ్ పై ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది.

ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఇరాన్లోని 82 వేలకు పైగా పౌర నివాసాలు దెబ్బతిన్నాయని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ వెల్లడించింది. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే.. తీవ్రమైన విపత్తు ఎదుర్కొనే ప్రమాదం ఉందని అది హెచ్చరించింది.

**బహ్రెయిన్ పై ఇజ్రాయెల్ దాడులు**

హెజ్బొల్లా దాడుల నుంచి తమ ఉత్తర సరిహద్దు పట్టణాలను రక్షించుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ఇజ్రాయెల్ తమ బలగాలను మోహరించింది. హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

# నేత్రపర్వం.. ఆధ్యాత్మికానందం

(మొదటి పేజీ తరువాయి)

ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల మహోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఆశీస్సులు పొందారు. మహోత్సవాన్ని తిలకిస్తూ భక్తి పరవశంలో మునిగారు. పట్టాభిషేక వేడుకలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. తొలుత రామాలయంలో భద్రుని మండపంలో స్వామివారి పాదుకలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గౌతమీ నదీ తీరం నుంచి పవిత్ర తీర్థములను తీసుకువచ్చి రాజ లాంఛనాలతో మిథిలా ప్రాంగణానికి ఊరేగింపుగా స్వామివారిని తీసుకువచ్చారు. భాజా భజంత్రీల నాదాలు, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటాలతో ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కళ్యాణ మండపంలో స్వామివారు ఆసీనులైన అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. తరువాత పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలతో స్వామివారికి రాజలాంఛనాలు అలంకరించి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పారాయణాలతో పాటు విష్ణు పురాణం, భగవత్ శాస్త్ర పారాయణాలు జరిగాయి. పుష్కర జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ నిర్వహించగా, అనంతరం హారతులు సమర్పించారు. పట్టాభిషేక వేడుకల సందర్భంగా మిథిలా ప్రాంగణం మొత్తం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమం అనంతరం భక్తులపై పుణ్య నదీ జలాలను చల్లి ఆశీర్వదించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం వంటి ప్రధాన వేడుకలకు హాజరైన భక్తులు తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగారు. ఈ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ఐటీడీఏ పీఓ రాహుల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి రామభక్తుల చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సుమారు రూ.350 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. భద్రాచలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు. అనంతరం ఐటీడీఏ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరి మార్ట్‌ను గవర్నర్ సతీసమేతంగా ప్రారంభించారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం లక్ష్యంగా ఈ గిరి మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అటవీ ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, గిరిజన హస్తకళా వస్తువులను ఒకే వేదికపై విక్రయానికి అందుబాటులో ఉంచడం ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.

గిరి మార్ట్ ప్రారంభానంతరం అక్కడ అమ్మకానికి ఉంచిన గిరిజన ఉత్పత్తులను గవర్నర్ సతీసమేతంగా పరిశీలించి, వాటి ప్రత్యేకతలు, తయారీ విధానం, మార్కెటింగ్ సదుపాయాల గురించి జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ పర్యటనను దృష్టిలో ఉంచుకొని పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించారు. మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేసింది.

# అడ్డుకుంటే శివతాండవమే



(మొదటి పేజీ తరువాయి)

చేయలేనిది ఎవరూ చేయొద్దనే అక్కసుతో కొందరు అడ్డుకోవాలని చూస్తునానరనీ, ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో ఎన్నో పదవులు అనుభవించిన సబితక్క కొడుకు అభివృద్ధిని అడ్డుకోవడానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశాడని తెలిపారు. అక్క వెనక ఎవరున్నా వదిలి పెట్టం. మా అక్కకు ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా...నీ పుత్రరత్నం ఎన్జీటీలో వేసిన కేసును వెనక్కి తీసుకోండి లేకపోతే ప్రజలే మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తారని హెచ్చరించారు. మీ వెనక ముసుగు తొడుక్కున్న వారికి కూడా చెబుతున్నా ఇలాగే వ్యవహరిస్తే ఇప్పుడున్న స్థానం కూడా వారికి ఉండదని స్పష్టం చేశారు. ఆరునూరైనా అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదు ఇది శివ దీక్ష అని పేర్కొన్నారు. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా మారుస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అక్రమ మైనింగ్, ఇసుక మాఫియాపై సీఐడీ విచారణ జరిపిస్తం

- **అందుకే కేటీఆర్ మైనింగ్ శాఖ తీసుకున్నడు**
- **బీఆర్ఎస్ పైరవీలకు పొంగులేటి లొంగనందుకే బ్లాక్‌మెయిల్**
- **ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నాలను సహించం**
- **విచారణలో నిజాలు నిగ్గు తేల్చి అసెంబ్లీలో నివేదిక పెడతం**

**హైదరాబాద్, మార్చి 28 (మనం బ్యూరో):** రాష్ట్రంలో మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీఐడీ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటించారు. శనివారం అసెంబ్లీలో మైనింగ్ అంశంపై వాడి వేడి చర్చ జరిగింది. బీఆర్ఎస్ సభ్యుడు హరీష్ రావు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. కంచె చేను మేసినట్లు రక్షకుడే భక్షకుడిగా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోందని విమర్శించారు. పొంగులేటి మంచి మిత్రుడు ఆయన నేను కలిసి పని చేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పుడు చేస్తామనడం సరికాదని వ్యాఖ్యానించారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుంటూ సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్ రావు ఆయన తండ్రి రవీందర్ రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అలాగే, గంగుల కమలాకర్ అక్రమ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణ సిద్ధం.
రాఘవ కన్‌స్ట్రక్షన్‌తో పాటు అన్నింటిపై నిజాలు నిగ్గు తేలుస్తాం. అందుకే సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎలాంటి తప్పిదాలు జరిగినా మా ప్రభుత్వం ఉపేక్షించదు. అందులో భాగంగానే రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోమందని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ నుంచి మైనింగ్ శాఖ ఫైన్ కట్టించుకుందనీ, ఇది వాళ్లు కనిపెట్టి ఫిర్యాదు చేస్తే తీసుకున్న చర్య కాదని వ్యాఖ్యానించారు. మా ప్రభుత్వమే వివరాలు తీసుకుని చర్యల తీసుకుందనీ, మంత్రిపై బురద చల్లాలని వాళ్ల పైరవీలకు సహకరించడం లేదని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటి వారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీష్ రావు తమ్ముడు మహేశ్వర్ రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతల బ్లాక్ మెయిల్‌కు ప్రభుత్వం లొంగదనీ, సీఐడీ విచారణతో నిజాలు నిగ్గు తేలుస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# ఈవీ సబ్సిడీల జూలై 31 వరకు పొందొచ్చు

**ఢిల్లీ, మార్చి 28:** దేశంలో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం పీఎం ఈ-డ్రైవ్ పథకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) కొనుగోళ్లపై అందించే సబ్సిడీల గడువును పెంచుతూ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 31తో ముగియనున్న ఈ గడువును, జూలై 31కి పొడిగిస్తూ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, ఈ-రిక్షా, ఈ-కార్టు వాహనాల సబ్సిడీలను కూడా మార్చి 31, 2028 వరకు పొడిగించినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అధికారిక అంచనాల ప్రకారం, పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద టూ-వీలర్ల కోసం కేటాయించిన మొత్తం రూ. 1,772 కోట్లలో, ఇప్పటివరకు రూ. 1,259.91 కోట్లు రాయితీ రూపంలో ఖర్చు అయ్యాయి. కాగా, తొలిసారిగా 2024 అక్టోబర్ 1న ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఎలక్ట్రిక్ టూ వీలర్లు, త్రీవీలర్లు, ఈ-అంబులెన్సులు, ఈ-ట్రక్కులపై కేంద్రం రాయితీ అందిస్తోంది. మొత్తం 14 లక్షల ఈవీ టూవీలర్ల అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 24.8 లక్షలు విక్రయం అయ్యాయి. ఒక్క టూవీలర్ విభాగంలోనే 10 లక్షల యూనిట్లు అమ్ముడైనట్లు కేంద్రం అంచనా వేస్తోంది.

# పేదోళ్లవి కూల్చి.. పెద్దోళ్లకు దోచి పెడ్తవా?

## మీరు, మీ మంత్రుల కుంభకోణాలు, అవినీతిపై ప్రశ్నిస్తే బెదిరిస్తవా?

## సీఎం రేవంత్‌వి అహంకారపూరిత వ్యాఖ్యలు: కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లు చట్టవిరుద్ధమని చెప్పే ప్రభుత్వం... అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చివేయడానికి, దాదాపు 3 వేల ఎకరాల భూమిని సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి కుంభకోణాలు, అవినీతి గురించి ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నిస్తే?.. ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణిలో మాట్లాడారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రికి బెదిరింపులు అలవాటుగా మారాయని ఆయన దుయ్యబట్టారు. కానీ, ఆయన బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని గుర్తుంచుకోవాలని కేటీఆర్ అన్నారు.

ఇక, ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయడానికి ఖజానాలో



ఒక్క రూపాయి లేదని చెబుతున్న ముఖ్యమంత్రి, మరి మూసీ ఒడ్డున ఓ భారీ ప్రాజెక్టు కోసం మాత్రం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం అత్యంత విడ్డూరమని ఆయన అన్నారు. మూసీ ప్రాజెక్టు పేరుతో అక్రమాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ అవినీతిని ప్రశ్నిస్తే?, శివతాండవం చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ అత్యంత అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అమెరికాను ఆందోళనకు గురిచేస్తోన్న 'తోమహాక్'

- **తరిగిపోతున్నాయని రక్షణ వర్గాల కలవరం**
- **ఆయుధాల ఉత్పత్తి వేగవంతం**
- **వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్**

**వాషింగ్టన్, మార్చి 28:** ఇరాన్‌పై యుద్ధాన్ని మొదలుపెట్టిన దగ్గరి నుంచి అమెరికా 850 తోమహాక్ క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది.
ఈ నంబర్ అమెరికా రక్షణ వర్గాలను కలవరానికి గురిచేస్తోందట. సగటున ఒక ఏడాదికి పెంటగాన్ కొనుగోలు చేసే వాటికంటే ఆ సంఖ్య తొమ్మిది రెట్లు ఎక్కువట.సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ గణాంకాల ప్రకారం.. అమెరికా ఏడాదికి 90 వరకు తోమహాక్‌లను కొనుగోలు చేస్తుంటుంది. 2026 ఏడాదికి యూఎస్ నేవీ నుంచి 57 మిస్సైళ్లకే రిక్వెస్ట్ వచ్చిందని యూఎస్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ బడ్జెట్ పత్రాల ద్వారా వెల్లడవుతోంది. ప్రస్తుతం భారీ స్థాయిలో వీటిని వినియోగించడంతో అవి తరిగిపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ట్రంప్ యంత్రాంగం మాత్రం అలాంటిది ఏమీ లేదని చెబుతోంది. ''యుద్ధ లక్ష్యాలను పూర్తి చేసేందుకు కావాల్సిన ఆయుధ సంపత్తి అమెరికా వద్ద ఉంది. అమెరికా అభివృద్ధి చేసిన ఆయుధాల ఉత్పత్తి వేగవంతం చేసేలా ట్రంప్ చర్యలు తీసుకుంటున్నారు'' అని కొరత వార్తలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కొట్టిపడేశారు.

సుదూర లేక అత్యంత పటిష్ఠమైన లక్ష్యాలను ఛేదించేటప్పుడు అమెరికా తోమహాక్‌లను రంగంలోకి దింపుతుంది. ప్రస్తుతం ఇరాన్ లక్ష్యాలపై యూఎస్ వీటిని పదేపదే వాడుతోంది. వీటిని ఎక్కువగా విధ్వంసక నౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగిస్తుంటారు. అత్యంత కచ్చితత్వంతో 1000 మైళ్లకు (1609 కి.మీ.) పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను ఢీకొడుతుంది. అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలను కూడా దాటుకొని దాడి చేస్తుంది. ఆర్మీ కూడా వీటిని వినియోగిస్తోంది. బ్రిటన్ నేవీ సహా యూఎస్ మిత్రదేశాల వద్ద ఇవి ఉన్నాయి.

# అరుంధతీ రాయ్‌కి అమెరికా బుక్ క్రిటిక్స్ అవార్డు

**న్యూయార్క్, మార్చి 28:** విఖ్యాత భారతీయ రచయిత్రి అరుంధతి రాయ్ రచించిన ఆత్మకథ పుస్తకాలు.. అమెరికా వార్షిక 'నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డు జాబితాలో విజేతగా నిలిపాయి. ఆమె రాసిన 'మదర్ మేరీ కమ్స్ టు మీ' నవలకు ఈ అవార్డు దక్కింది.

# అధికార పక్షానికో న్యాయం..ప్రతిపక్షానికో న్యాయమా?

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్' శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. సర్వే నంబర్ 62, 63లలో జరుగుతున్న ఈ అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందని ఆయన ఆరోపించారు. మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చినా, లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. 'అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయమా?' అని మండిపడ్డారు.

తన ట్వీట్లపై మంత్రి 'మొరిగే కుక్కలు' అంటూ చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు ఖండించారు. అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అది కచ్చితంగా పొంగులేటి సంస్థేనని స్పష్టం చేశారు. ఆయన మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని, అందుకే వెంటనే రాజీనామా చేసి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి? లేదా? ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయండి. ఒకవేళ నేను చెప్పేవి నిజాలైతే మాత్రం వెంటనే రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి' అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఓపెన్ వర్సిటీ విద్యార్థులకు

## ఉద్యోగ, నైపుణ్య కోర్సులు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** డిగ్రీ మొదటి, 2వ సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కోర్సులు- నైపుణ్యాలపై ఆదివారం అన్ని అధ్యయన కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్పోరేట్ ఉద్యోగాలు పొందడానికి అవసరమైన నైపుణ్యం అందించే సంస్థలతో ప్రత్యేక కోర్సులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రధానంగా రామానంద ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలు అన్ని అధ్యయన కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం సమీపంలోని అధ్యయన కేంద్రంలో కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని, లేదా ఈ నెంబర్లలో 040-23680333/555లో సంప్రదించాలని యూనివర్సిటీ అధికారులు సూచించారు.

# ఎల్లుండే లాస్ట్ డేట్

(మొదటి పేజీ తరువాయి)

తుడిచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై లోక్‌సభలో కీలక చర్చ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఎల్లుండి (ఈ నెల 30) లోక్‌సభలో ఈ అంశంపై స్వల్పకాలిక చర్చ జరపబోతున్నది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధన 193 ప్రకారం స్వల్పకాలిక చర్చ నిర్వహించాలని లోక్‌సభ సభ్యులు శ్రీకాంత్ ఏక్నాథ్ షిండే, బైరెడ్డి శబరి స్పీకర్కు నోటీసులు ఇచ్చారు. వీరి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్ ఓం బిర్లా ఎల్లుండి చర్చ జరపనున్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో ఆపరేషన్ కగార్, మావోయిస్టు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.





# రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి కొరవడింది



## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయి

## రాష్ట్ర కేబినెట్‌లో ప్రతిభకలిగిన క్రీడాకారులు ఉన్నారు: సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్,మార్చి28(మనం న్యూస్)ః ఒకప్పుడు తెలంగాణ క్రీడల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి తగ్గిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. శనివారం హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ శాసన సభ్యుల స్పోర్ట్స్ మీట్-2026 తొలి ఎడిషన్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని కాసేపు శాసన సభ్యులతో క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిత్యం ప్రజా క్షేత్రంలో ఉన్న రాజకీయ నాయకులకు క్రీడలు ఉపశమనంగా ఉపయోగపడతాయని రేవంత్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కేబినెట్‌లో అద్భుతమైన క్రీడాకారులు ఉన్నారని,వారిలో ఉన్న ప్రతిభను ప్రదర్శించే అవకాశం మరోసారి స్పోర్ట్స్ మీట్ ద్వారా వచ్చిందని ఆయన వెల్లడించారు. ప్రజా ప్రతినిధులంత ఇవాళ మంచి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.లోగడ తెలంగాణ క్రీడల రాజధానిగా ఉండేదని, ఆ తర్వాత రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా క్రీడాపోటీలు నిర్వహించక పోవటంతో తెలంగాణ వచ్చాక క్రీడా స్ఫూర్తి తగ్గింది' అని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

**క్రీడలకు కేరాఫ్ అడ్రస్ః**

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే గిట్టనివారు వివాదం సృష్టించారని, నగరాన్ని గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చే ప్రయత్నాలను రాజకీయ కోణంలో చూడటం చాల బాధాకరమని ముఖ్యంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ అంటే కేవలం బిర్యానీ, ఐటీ మాత్రమే కాదని, క్రీడలకు కూడా కేరాఫ్ అడ్రస్ అని ప్రపంచానికి చాటిచెప్పేందుకే మెస్సీని ఆహ్వానించామని సీఎం స్పష్టంచేశారు. కానీ కొందరు పనిగట్టుకోని దీనిని తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్నామని విమర్శించడం దురదృష్టకరం అని రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై నర్మగర్భంగా విమర్శనాస్త్రాలు సంధించారు.కోల్‌కత్తా వంటి నగరాల్లో మెస్సీ పర్యటన గందరగోళంగా ముగిసినా, హైదరాబాద్‌లో మాత్రం అత్యంత క్రమశిక్షణతో, విజయవంతంగా నిర్వహించామని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఇది తెలంగాణ ఆతిథ్యానికి, సమర్థతకు నిదర్శనమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## భలే పసందుగా ప్రజా ప్రతినిధుల ఆటలు..

అసెంబ్లీ సమావేశాల ఒత్తిడిని పక్కన పెట్టి, పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఆటల పోటీల ప్రారంభ గేమ్‌గా టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. రెండు జట్లుగా విడిపోయిన ఎమ్మెల్యేలు పక్క ఎమ్మెల్యేలు బలంగా లాగడంతో ప్రత్యర్థి టీమ్ లో ఉన్న వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహా పలువురు ఎమ్మెల్యేలు పట్టు తప్పి ఒక్కసారిగా వెల్లకిలా పడిపోయారు. కిందపడినా సరే చిరునవ్వుతో లేచిన ఎమ్మెల్యేలు, తిరిగి ఉత్సాహంగా ఆటను కొనసాగించడం అక్కడున్న వారందరినీ ఆకట్టుకుంది.

**తొలి ఎడిషన్ ప్రత్యేకం..**

తెలంగాణ శాసనసభ చరిత్రలో ఇలాంటి స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ పోటీల్లో క్రికెట్, ఫుట్‌బాల్‌తో పాటు పలు గ్రామీణ క్రీడలను కూడా చేర్చారు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో వేడెక్కే అసెంబ్లీ వాతావరణం నుండి ఉపశమనం పొందడానికి, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత పెంచడానికి ఈ క్రీడలు దోహదపడతాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ అభిప్రాయపడ్డారు.



## లెమన్ అండ్ స్పూన్ పోటీలో కొండా టాప్



ఫుట్‌బాల్ పోటీలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని అందరిలో జోష్ నింపారు. ఇదిలాఉంటే, లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి, రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వారినుద్దేశించి మాట్లాడుతూ..క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడానికి ఈ ఎల్‌బీ స్టేడియం వేదిక అవుతోందని ఆయన అన్నారు. తన మంత్రివర్గంలో, దేశానికి వన్నెతెచ్చిన అజారుద్దీన్ (మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి), రంజీ వరకు ఆడిన వాకిటి శ్రీహరి (క్రీడాశాఖ మంత్రి),ప్రతిపక్ష పార్టీలో కూడా పాడి కౌశిక్ రెడ్డి వంటి వారు ఉన్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

## తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నిరంతర కృషి చేసిన నరసింహ యాదవ్

- కార్యకర్త నుండి రాష్ట్ర నాయకుడిగా ఎదిగిన నేత
- అన్న ఎన్టీఆర్ ఆదర్శంగా మూడు తరాల నాయకులతో పని చేసిన నాయకుడు
- నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం



తిరుపతి మార్చి 28 మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారకరామారావు ఆశయ సాధన తో అన్న ఎన్టీఆర్ ను ఆదర్శంగా తీసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేసిన బడుగు బలహీన వర్గాల నాయకులు జి.నరసింహ యాదవ్.సాధారణ కార్యకర్త నుంచి అంచలంచెలుగా ఎదిగి నేడు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఉన్న నేత నరసింహ యాదవ్. ఆయన తెలుగుదేశం పార్టీలో ఎన్నో ఒడిదుడుకులకు తట్టుకొని ఇప్పటికీ సేవ సేవలందిస్తున్నారు.1982 నుంచి 2026 వరకు ఎన్నో బెదిరింపులు, అవమానాలు భరించి మొక్కుబోని ఆశయసాధనతో తెలుగుదేశం పార్టీ ని వాడవాడలా విస్తరింపజేశారు.తన తండ్రి కదిరప్ప యాదవ్ తో కలిసి పార్టీ అవిర్భావం లో సాధారణ కార్యకర్త నుంచి నగర కమిటీ,జిల్లా కమిటీ,రాష్ట్ర బీసీ సెల్, తిరుపతి మార్కెట్ కమిటీ, తిరుపతి తుడా ఛైర్మన్,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ ఇలా అనేక పదవులను చేపట్టి పార్టీని ఎంతో అభివృద్ధి చేశారు. అన్న ఎన్టీఆర్ ను ఆదర్శంగా తీసుకొని పార్టీలో చేరడమైనది.అన్న తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీని ఎంతగానో బలోపేతం చేశారు. ప్రస్తుతం యువ నాయకులు నారా లోకేష్ ను ఆదర్శంగా తీసుకొని పార్టీలో అనేక అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నారు.

అలా మూడు తరాల వారితో కలిసి పనిచేసిన అనుభవం గొల్లనరసింహ యాదవ్ ది, రాయలసీమలోనే తెగులు దేశం పార్టిలో ఉన్న బీసీలలోనే జి.నరసింహ యాదవ్ ఒక నాయకుడుగా ఖ్యాతి గడించారు. తిరుపతి పార్లమెంట్ పార్టీ అధ్యక్షులుగా సుమారు 6 సంవత్సరములు,ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పార్టీ క్యాడర్ ను సమన్వయం చేస్తూ,పార్టీ బలోపేతానికి అనేక కార్యక్రమాలు నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.వర్గాలకు అతీతంగా, ప్రతి నియోజకవర్గంలో తెలుగుదేశం నాయకులను,క్యాడర్ ను,కలుపుకొని పనిచేశారు. ముఖ్యంగా నారా చంద్రబాబు నాయుడుకి నమ్మిన బంటుగా తాను ఏది చెబితే అది చేసే వ్యక్తిగా,తన కుటుంబ సభ్యుడిగా ఉంటూ చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారు. అదేవిధంగా నారా చంద్రబాబు నాయుడు గారి కుటుంబం తో నరసింహ యాదవ్ కుటుంబానికి మొదటి నుంచి అనుబంధం ఉంది.పార్టీ అవిర్భావం నుండి పార్టీ కోసం పనిచేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అతి కొద్ది మంది నాయకులలో నరసింహ యాదవ్ ఒకరు. ఏనాడు పదవుల కోసం కానీ,పార్టీ పై అసంతృప్తి,లేదా పార్టీపై అలిగిన నాయకుడు కాదు, చంద్రబాబు నాయుడు ఆదేశం సారం తాను పార్టీకి వెన్నుతునగా నిలిచి పనిచేశారు.సోమవారం నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించదానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## 30న రాష్ట్ర ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా రాక

- జిల్లా కలెక్టర్

తిరుపతి, మార్చి 28 మనం న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్క రోజు పర్యటనలో భాగంగా మార్చి 30న తిరుపతి జిల్లాకు విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన పర్యటనలో భాగంగా ఈ నెల 30న ఉ.11.30 దొరవారిసత్రం మండలం నెల్లబల్లి గ్రామం నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, అనంతరం ఉ.11.50 గం.లకు నాయుడుపేట మండలం పుదూరు గ్రామం నందు నూతనంగా నిర్మించిన ఏపి టిడ్కో గృహాల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడతారన్నారు. తదుపరి మ. 12.40 గం.లకు పుదూరు గ్రామం నందు ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం మ.2.40 గం.లకు నాయుడుపేట మండలం బిరడవాడ గ్రామం నందు రాజకీయ ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు. తదుపరి మ.4.20 గం.లకు దొరవారిసత్రం మండలం నెల్లబల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి తిరుపతి ఎస్ వి అగ్రికల్చర్ యూనివర్సిటీకి బయల్దేరి వెళతారన్నారు. అనంతరం సా.4.35 గం.లకు తిరుపతి ఎస్.వి అగ్రికల్చర్ యూనివర్సిటీ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని సా.4.45 గం.లకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం నందు పి4 కార్యక్రమం లో పాల్గొంటారన్నారు. అనంతరం సా.6.35 గం. లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడ బయల్దేరి వెళతారన్నారు.



## అంగన్ వాడీ చిన్నారులకు 'తొలిముద్ద'

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉప్మా, కిచిడీ అందించనున్న ప్రభుత్వం
- అసెంబ్లీ ప్రాంగణంలో ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అంగన్వాడీ వర్కర్లకు మొబైల్ ఫోన్‌లు పంపిణీ
- మీ సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నం

హైదరాబాద్, మార్చి 28 (మనం బ్యూరో) : అంగన్ వాడీ చిన్నారులకు ఇక నుండి రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్) ను ప్రభుత్వం బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. అసెంబ్లీ సమావేశ మందిరంలో శనివారం చిన్నారులకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ "తొలి ముద్ద"ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉంది కానీ, న్యూట్రీషన్ ఫుడ్ అందడం లేదని పేర్కొన్నారు.

అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుండే తల్లికి పౌష్టిక ఆహారం అందజేస్తోందని వెల్లడించారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారంభించామనీ, ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు రూపొందించినా అమలు చేయాల్సింది మాత్రం అంగన్వాడీ టీచర్లు మాత్రమేనని స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టింది. అంగన్వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని వారికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా చూస్తుందనీ, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆరేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందనీ, పౌష్టికాహారం లేకపోవడం వల్లనే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ వాకౌట్

### పోలీసులు, ఆర్‌టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వానికి పట్టదా?

హైదరాబాద్, మనం ప్రతినిధి : పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడే అయితే ఎక్కడున్నా మనకు కావాల్సింది వస్తుందని అంటారు.. కానీ, ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడేవారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్ తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక, పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్ తెలిపారు. పోలీసులకు ఈహెచ్‌ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బడ్జెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ప్లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

## జీతం ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంది...

రాత్రి ఆకాశం ఏదో కోల్పోయినట్టుంది.
పేదవాడి బతుకులో వెన్నెల అలుముకున్నట్టుంది
పిడికెడు బియ్యంలో నక్షత్రాల్లాంటి రాళ్లు
సగం కడుపునే ఆక్రమించి బాధిస్తున్నాయి..

నెల చివరలో మాయమయ్యావు నేస్తమా!
కళలన్నీ తరిగిపోయిన అమావాస్య చంద్రుడిలా..
బడుగు జీవుల నెల జీతం నెలంతా సాగక
సంసారపు బండిని చీకటి వీధిలో వదిలేశావా?

ఒకటో తారీకు కొత్త వెలుగు వస్తుందా?
శరీరం చిందించిన చెమటను తుడిచేందుకు..
రక్తాన్ని మరిగించి, యంత్రంలా శ్రమిస్తే గానీ
ఒక్క పూట పరమాన్నం దక్కదు అదే ఒక పండుగ!

నిజంగా అదేనేమో పండుగ పరమార్థం..
ఉన్నవాడికి లేనివాడికి
వ్యత్యాసం చూపేందుకు!
నిప్పుల్లో కాలిన శరీరాన్ని సేదదీర్చేందుకు
పొయ్యి మీద చారెడు మెతుకులు ఉడకాలి..

వెలుగు నింపే సంక్రాంతి..
పేదవాడికి శివరాత్రేమో!
ఉపవాసం పేరుతో రోజా
పండుగే ఈ కటిక దరిద్రుడికి
పంచభక్ష్య పరమాన్నాల పేర్లు వినడమే తప్ప
ఆకాశ పళ్లెంలో ఆ రుచులని ఏనాడూ చూడలేదు..

ఎండిన చేనులో సూర్యుడి నిప్పులే కనిపిస్తున్నాయి
తడి ఆరిన మనసులో ఎడారి గోచరిస్తోంది
పచ్చని అడుగులో కారుచిచ్చు రగులుతోంది
నెల జీతం.. పౌర్ణమి
దాటిన చంద్రుడిలా అరిగిపోతోంది!

మధ్యతరగతి మోమున నిరంతర
మందహాసం పూయాలంటే
ఉషోదయపు కాంతిలా
బతుకు బాట సాగాలంటే..
జీవన యానానికి ధనపు రెక్కలు తొడుగుతూ
సాగుతున్న గమ్యంలో
కాస్త 'సిరి' సంపదై ఉండాలి!

**- కొప్పుల ప్రసాద్**
9885066235

# తెలుగుదేశం.. అప్రతిహత శక్తి ప్రసారిణి



ఉమ్మడి రాష్ట్రంలో 44 ఏళ్ళ క్రితం ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి ఒక చారిత్రక నేపథ్యం ఉంది. తెలుగువాడి ఆత్మగౌరవం అభివృద్ధి నినాదంతో ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశంపార్టీ జాతీయ స్థాయిలో ఎన్నో ప్రాంతీయ పార్టీలకు ఆదర్శమైంది. దేశవ్యాప్తంగా 57 ప్రాంతీయ పార్టీలు ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఉన్న చరిత్ర మిగతా ఏ పార్టీకి లేదనే చెప్పాలి.

ఢిల్లీ పెద్దల అహంకారపు చెరలో తెలుగువారి ఆత్మగౌరవం అవమానాలు ఎదుర్కోవడం చూసి ఆ తెలుగు పౌరుషం రగిలిపోయింది. ఒక తెలుగుబిడ్డగా తెలుగువాడి తేజం ఏంటో ప్రపంచానికి చూపించాలంటే తన రాజకీయ రంగ ప్రవేశం అనివార్యం అని భావించారు. సుదీర్ఘ కాంగ్రెస్ పాలనకు ప్రత్యామ్నయంగా 1982 మార్చి 29న తెలుగుదేశం ఆవిర్భవించింది. తెలుగు ప్రజల ఏకైక ఆశాదీపం తెలుగుదేశం పార్టీ నిలిచింది.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే ఒక చరిత్ర. ఇది కేవలం అధికారం కోసం ఆవిర్భవించిన పార్టీ కాదు. తెలుగునాట అతిపెద్ద సామాజిక విప్లవానికి నాంది పలికింది. నాలుగు గోడల మధ్యకే పరిమితం అయిన రాజకీయం తెలుగుదేశం ఆవిర్భావంతో సామాన్యుని ముంగిటకు చేరింది. నాడు మదారాసీ పరదాల మాటున మగ్గిపోతున్న తెలుగుజాతి ఔన్నత్యానికి ఎన్టీఆర్ వెలుగును ప్రసాదిస్తే చంద్రబాబు హయాంలో ఆ వెలుగు విశ్వవ్యాప్తం అయింది. నారా లోకేష్ ఆ వెలుగు మసకబారకుండా మరింతగా వన్నె తెస్తున్నారు.

టీడీపీ పుట్టిన తర్వాత పది సార్లు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగితే ఆరు సార్లు అధికార పగ్గాలు చేపట్టిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం ఒక్కటే. దేశంలోనే తెలుగుదేశం పార్టీకి ఒక ప్రత్యేకత వున్నది. దేశ రాజకీయ యవనికపై దశాబ్దాలుగా ప్రస్థానం సాగిస్తున్న అతికొద్ది ప్రాంతీయ పార్టీలలో తెలుగుదేశం ముందువరుసలో వుంది. వర్తమాన రాజకీయాలలో తెలుగుదేశం పార్టీకి ఎదురైనన్ని సవాళ్లు మరే పార్టీకి ఎదురుకాలేదు. అందుకు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వేసిన పునాది, చంద్రబాబు దానిని పటిష్టం చేసిన వైనం అందుకు ప్రధాన కారణం. తెలుగునేలపై అతిపెద్ద సైన్యం తెలుగుదేశం పార్టీ సొంతమనే చెప్పాలి.

44ఏళ్ల తర్వాత కూడా తెలుగునాట 45.60 శాతం ఓటింగ్ కలిగి వుండటం సాధారణ విషయం కాదు. టిడిపి ఆవిర్భావం నుంచి జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తోనే రాజకీయ పోరాటం జరిపింది. ఆ పార్టీని కూకటివేళ్లతో పెకలించి 1983 వ సంవత్సరంలో ఎన్టీఆర్ తెలుగుజాతి సత్తాను ప్రపంచానికి చాటారు. కేవలం అధికారం చేపట్టడమే గాక, తెలుగుజాతి గౌరవాన్ని, ప్రతిష్టను పెంపొందించడం, తెలుగు ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం, పేద, బడుగు, బలహీన వర్గాలలో జీవన రేఖలు వికసింప చేయటం వంటి అంశాలు రాష్ట్ర చరిత్రలో టిడిపికి చెరగని ముద్ర వేశాయి.

టిడిపి మూల సిద్ధాంతంలోనే సామాజిక న్యాయం ఇమిడి ఉన్నది. ఎన్టీఆర్ తొలి కేబినెట్‌ను కానీ చంద్రబాబు నాయుడు మంత్రి వర్గాలను పరిశీలిస్తే సామాజిక న్యాయం ఏ స్థాయిలో అమలైంది అవగతమవుతుంది. అత్యంత కీలకమైన శాఖలను ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు కేటాయించారు. నేటికీ సామాజిక న్యాయం నూరుశాతం అమలవుతున్నది ఒక్క తెలుగుదేశం పార్టీలోనే అంటే అతిశయోక్తి కాదు. మరే ప్రాంతీయ పార్టీకి లేని విధాన నిర్ణాయక మండలి (పొలిట్ బ్యూరో) ఒక్క టిడిపికి మాత్రమే వుంది. ఆ మండలిలో సభ్యుల సామాజిక వర్గాలను పరిశీలిస్తే టిడిపిలో అసలైన సామాజిక న్యాయం అమలవుతున్న విషయం స్పష్టమ వుతుంది. టిడిపి హయాంలో ప్రవేశ పెట్టిన ఎన్నో పథకాలు సంక్షేమం అన్న పదానికి భాష్యం చెప్పాయి.

ఆ పథకాలు దేశ రాజకీయాలకు ఒక ప్రామాణికంగా, దిక్సూచిగా మారాయి. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ప్రవేశ పెట్టడం అప్పట్లో ఒక చరిత్ర. ఆ పథకం దేశవ్యాప్తంగా ఆహారభద్రత చట్టం రూపకల్పనకు దారితీసింది. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్‌లు, పేదలకు జనతా వస్త్రాలు, పక్కా గృహాలు వంటి పథకాలు, వివిధ రకాల పేర్లతో నేటికీ చలామణి అవుతూనే వున్నాయి. అనంతరం పార్టీ సారథ్య బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు పార్టీని మరో స్థాయికి తీసుకెళ్లారు. అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల స్వారీ మాదిరి పరుగులు పెట్టించారు. ఎప్పటికప్పుడు అందివస్తున్న సాంకేతిక పరిజ్ఞా నాన్ని పాలనకు జోడించి గుడ్ గవర్నెన్స్‌కు రూపకల్పన చేసి ప్రపంచమంతా తెలుగునేల వైపు తలతిప్పి చూసేలా చేశారు. ఐటి విప్లవాన్ని సృష్టించారు. వర్తమాన రాజకీయాల్లో పూటకొక పార్టీ మారు తున్న నాయకులు మనకు తారస పడుతున్నారు. అయితే గత 44 సంవత్సరాలుగా రాజకీయ ఒడిదుడుకులు, వత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులకు లొంగకుండా ఒకే పార్టీలో రాజకీయ ప్రస్థానం సాగిస్తున్న నాయకులు టిడిపిలో కోకొల్ల లుగా వున్నారు. ఈ ఘనత మరే ఇతర ప్రాంతీయ పార్టీలోనూ కానరాదు. చంద్రబాబు నాయకత్వంలో సుశిక్షితుడైన సైనికుని తరహాలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పార్టీ శ్రేణులలో పోరాట స్ఫూర్తి నింపుతున్నారు. నేడు నాలుగు దశాబ్దాల ప్రస్థానాన్ని విజయవంతంగా ముగించుకొని 45 వ ఏట అడుగు పెట్టింది.

ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు పాలనతో మొదలయ్యింది మరో సంచలన శకం. 'కదలి సాగుదాం మనం జన్మభూమికి... తల్లి పాల ఋణం కొంత తీర్చడానికి' అంటూ ప్రజలను పాలనలో భాగస్వాములను చేర్చారు చంద్రబాబు. విజన్ 2020 అంటూ 20 ఏళ్ళ ముందే ఇప్పుడు మనకేం కావాలో ఇప్పుడు మనమేం ఎంజాయ్ చేస్తున్నామో వాటన్నిటికీ రూపునిచ్చారు. నాలెడ్జ్ ఎకానమీని అభివృద్ధి చేయడం కోసం అమెరికా వీధుల్లో 14 రోజులు ఫైళ్లు పట్టుకుని తిరిగారు. హైదరాబాద్ లో 1998లో ప్రారంభమైన హైటెక్ సిటీ ఒక అంతర్జాతీయ సంచలనం. జంట నగరాల రాజధానికి సైబర్ సిటీని చేర్చడం మాత్రమే కాదు ఔటర్ రింగ్ రోడ్డుకు ఒక రూట్ మ్యాప్ ఇచ్చింది, శంషాబాద్ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం తెచ్చింది కూడా చంద్రబాబే. 2002లో 32వ జాతీయ క్రీడలను, 2003లో మొదటి ఆఫ్రో-ఆసియన్ గేమ్స్‌ను నిర్వహించి తన పాలనా స్థాయిని, సమర్థతను నిరూపించుకున్నారు. ప్రజాసమస్యలు తెలుసుకోవడం కోసం అక్టోబర్ 2, 2012 నుండి ఏప్రిల్ 27, 2013 వరకు 'వస్తున్నా మీ కోసం' అంటూ పాదయాత్ర చేపట్టి 63 సంవత్సరాల వయసులో 208 రోజుల పాటు, 2,817 కి.మీల దూరం నడిచారు చంద్రబాబు. పార్టీ పెట్టిన కొత్తలో ఎన్టీఆర్ చైతన్య రథయాత్ర తర్వాత ప్రజల నుంచి అంతటి అపూర్వ స్పందన చంద్రబాబు పాదయాత్రకు లభించింది. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకునే నేర్పరి తనం చంద్రబాబు సొంతం. అందుకే రాజధాని లేని నవ్యాంధ్రకు ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని అందించడానికి ప్రజా రాజధాని అమరావతిని నిర్మించడానికి పూనుకున్నారు చంద్ర బాబు. ఆయన మీది నమ్మకంతో అడగ్గానే రాజధాని కోసం 33 వేల ఎకరాలను ప్రజలు ఇవ్వడం నభూతో నభవిష్యతి. సచివాలయం, హైకోర్టు నిర్మాణాలు రికార్డు స్థాయిలో జరిగాయి చంద్రబాబు మార్కు అభివృద్ధి పాలనతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలోనూ తలెత్తుకునే స్థాయికి చేరింది. ఇక పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని దాదాపు తుది దశకు తీసుకురావడం, పట్టిసీమ పూర్తి... ఇలాంటివన్నీ చంద్రబాబుకు తప్ప అనితర సాధ్యం. ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా ప్రజల పక్షమైన తెలుగుదేశం పార్టీకి విశ్రాంతి అనేది లేదు. సమసమాజం నిర్మించబడి, పేదరికం లేని ఆనందకరమైన జీవితం ప్రతి తెలుగువాడికి అందించే వరకు జీవనదిలా, నిత్య చైతన్య ప్రవాహంలా చరిత్రను తనలో ఇముడ్చుకుంటూ ముందుకు పోతుంది తెలుగుదేశం. పసుపు అంటే ప్రజలకు శుభాన్ని ఇచ్చేది. పసుపు దళం అంటే ప్రజలకు భరోసా ఇచ్చేది. తెలుగు దేశం అంటే అప్రతిహత శక్తి ప్రసారిణి.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖమంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# కుక్కలతో భద్రతకు ముప్పు





దేశవ్యాప్తంగా, ముఖ్యంగా పట్టణాలు- పల్లెల్లో వీధి కుక్కల సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వీధుల్లో గుంపులుగా తిరిగే ఈ శునకాలు చిన్నా-పెద్దా అనే తేడా లేకుండా ప్రజలపై దాడులు చేయడం వల్ల భయం, ప్రాణ రక్షణ భావం పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ బెడదకు అత్యంత బలహీన వర్గాలుగా మారుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, సాయంత్రం ఆడుకునే బాలలు, ఉదయం వాకింగ్‌కు వెళ్లే పెద్దలు- అందరూ వీధి కుక్కల భయంతో బయటకు రావడానికి సంకోచించే పరిస్థితి ఏర్పడుతోంది.

ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు ఈ సమస్య తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. తెలంగాణలోని భువనగిరిలో ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ప్రజలను కలచివేసింది. అలాగే గుంటూరు, మెదక్, హనుమకొండ వంటి ప్రాంతాల్లో కూడా కుక్కల దాడులు వరుసగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఒకేసారి పలువురిపై దాడులు జరగడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో సూచిస్తోంది.

వీధి కుక్కల గుంపులు రాత్రిపూట మాత్రమే కాకుండా పగటిపూట కూడా రోడ్లపై తిరుగుతూ వాహనదారులను వెంబడించడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. వీధుల్లో అకస్మాత్తుగా కుక్కలు దూసుకొచ్చి వాహనాలను వెంబడించడం వల్ల డ్రైవర్లు నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది కేవలం వ్యక్తిగత ప్రమాదమే కాకుండా సామూహిక భద్రతకు ముప్పుగా మారుతోంది.

ఈ సమస్య ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. కుక్క కాట్ల ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధి అత్యంత ప్రాణాంతక మైనది. ఒకసారి రేబిస్ లక్షణాలు కనిపిస్తే ప్రాణాపాయం తప్పదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 60 వేల మంది రేబిస్ వల్ల ప్రాణాలు కోల్పోతుండగా, అందులో గణనీయమైన శాతం భారతదేశానిదే కావడం ఆందోళనకరం. దేశంలో 2030 నాటికి రేబిస్ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నేలస్థాయిలో చర్యలు వలన ఆశించినంతగా అమలవడం లేదు.

పశుసంవర్ధక శాఖ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. అధికారిక లెక్కలు ఒకటి చెబితే, వాస్తవ పరిస్థితి మరింత తీవ్రమై ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరాల్లో చెత్త నిర్వహణలో లోపాలు, ఎక్కడపడితే అక్కడ ఆహార వ్యర్థాలు పారవేయడం, మాంసపు మిగులు భాగాలు రోడ్లపై పడేయడం వంటి కారణాలు వీధి కుక్కల సంఖ్య పెరగడానికి దోహదపడుతున్నాయి.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కూడా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వీధి కుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించడం, వాటికి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయడం, రేబిస్ టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించింది. అయితే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు ఈ చర్యలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. సిబ్బంది కొరత, నిధుల లేమి, సమన్వయాభావం వంటి కారణాలు ఈ సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. వీధి కుక్కల సమస్యను కేవలం ఒక జంతు సమస్యగా కాకుండా, ప్రజా ఆరోగ్యం మరియు భద్రతకు సంబంధించిన అత్యవసర అంశంగా చూడాలి. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో శునకాల నియంత్రణ చర్యలు చేపట్టాలి. ప్రతి పట్టణంలో కుక్కల శస్త్రచికిత్స కేంద్రాలు, టీకా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేబిస్ టీకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలి. అదే విధంగా ప్రజల బాధ్యత కూడా ఎంతో కీలకం. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుల్లో మాత్రమే పారవేయాలి. వీధి కుక్కలకు ఆహారం పెట్టేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలి. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్క కాటు జరిగిన వెంటనే సమీప వైద్య కేంద్రంలో చికిత్స తీసుకోవడం తప్పనిసరి.

అంతిమంగా, వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజలు-మూడు వర్గాలు కలిసి పనిచేయాలి. కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, శాస్త్రీయ విధానాల అమలు- ఈ మూడు కలిసివచ్చినప్పుడే ప్రజా భద్రతను కాపాడగలం. లేదంటే ఈ సమస్య మరింత తీవ్రమై, భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముంది.

**- మేకిరి దామోదర్**
9573666650

# చరిత్రను జీవింపజేసిన మేధావి 'జైశెట్టి'



తెలంగాణ చారిత్రక పరిశోధనా శిఖరం డాక్టర్ జైశెట్టి రమణయ్య నిర్యాణం కేవలం ఒక వ్యక్తి భౌతిక నిష్క్రమణ మాత్రమే కాదు. అది ఒక సమగ్ర జ్ఞాన సంపదకు, ఒక సజీవ చరిత్రకు ముగింపు. 2026 మార్చి 27న జగిత్యాలలోని తన నివాసంలో ఆయన కన్నుమూయడం తెలంగాణ మేధో ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. చరిత్రను శ్వాసగా, పరిశోధనను జీవితంగా, సమాజాన్ని తన ఆలోచనల కేంద్రంగా చేసుకున్న మహనీయుడు లేకపోవడం తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, విద్యా రంగాలకు తీరని లోటు. ఆయన జీవితం, కృషి, ఆలోచనలు- తెలంగాణ చరిత్రలో ఒక ప్రకాశవంతమైన అధ్యాయంగా నిలిచిపోతాయి.

జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన రమణయ్య సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయుడిగా తన సేవలను ప్రారంభించి, విద్యను కేవలం పాఠ్యాంశాల బోధనగా కాకుండా, చైతన్యాన్ని రగిలించే సాధనంగా భావించారు. ఆయన తరగతులు కేవలం బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, చరిత్రపై ఆసక్తిని పెంపొందించే వేదికలుగా మారేవి.

అదే వేదికలో విద్యార్థిగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖరరావు అనే యువకుడిని ఆయన కేవలం ఒక విద్యార్థిగా చూడలేదు. సమాజాన్ని ప్రభావితం చేసే నాయకుడిగా తీర్చిదిద్దే దిశగా మార్గనిర్దేశం చేశారు. కేసీఆర్ భాషా పటిమ, చారిత్రక అవగాహన, రాజకీయ వ్యూహాల్లో కనిపించే లోతు వెనుక రమణయ్య బోధనలు, ప్రేరణలు కీలక పాత్ర పోషించాయని అనేక సందర్భాల్లో స్పష్టమైంది.

రమణయ్య పరిశోధనా ప్రస్థానం తెలంగాణ చరిత్రకు ఒక కొత్త దిశను ఇచ్చింది. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా దేవాలయాల చరిత్ర, శాసనాలు, శిల్పకళలపై ఆయన చేసిన కృషి అపూర్వమైనది. ప్రాచీన ఆలయాలను కేవలం ఆధ్యాత్మిక కేంద్రములుగా కాకుండా, సమాజ నిర్మాణానికి అద్దంగా ఆయన విశ్లేషించారు. ప్రతి శిలాశాసనం వెనుక ఉన్న కథను వెలికితీసి, దానిని సామాజిక, రాజకీయ పరిణామాలతో అనుసంధానించడం ఆయన ప్రత్యేకత. శాసనాల్లో కనిపించే రాజవంశాల పరిపాలన, ఆర్థిక వ్యవస్థ, భూవ్యవస్థ, సామాజిక స్థితిగతులను ఆయన శాస్త్రీయంగా వివరించారు.

ఈ క్రమంలో ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథాలు తెలంగాణ చరిత్రలోని అనేక అపోహలను తొలగించి, కొత్త వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చాయి. ఆయన పరిశోధనలలో కనిపించే ముఖ్య లక్షణం ఆయన క్షుణ్ణ పరిశీలన. మారుమూల గ్రామాల్లో తిరుగుతూ, నిర్లక్ష్యానికి గురవుతున్న శాసనాలను సేకరించడం, వాటిని పఠించడం, అర్థం చేసుకోవడం, ఆపై వాటి ఆధారంగా చారిత్రక నిర్ధారణలు చేయడం అనేది సాధారణ విషయం కాదు. శాస్త్రీయ దృక్పథం, సహనం, పరిశోధన పట్ల అపారమైన నిబద్ధత ఉంటేనే సాధ్యమయ్యే ఈ కృషి రమణయ్యను ప్రత్యేక స్థానంలో నిలబెట్టింది.

తెలంగాణ ఉద్యమంలో రమణయ్య పాత్ర విశేషమైనది. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఆయన చరిత్ర ఆధారాలతో వివరించడం ద్వారా ఉద్యమానికి ఒక మేధోపరమైన బలం అందించారు. ఒక ప్రాంతం తన చరిత్రను తెలుసుకున్నప్పుడే తన హక్కుల కోసం పోరాడగలదని ఆయన విశ్వాసం. ఆయన రచనలు, ఉపన్యాసాలు తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాయి. ఉద్యమానికి సిద్ధాంతపరమైన స్పష్టతను ఇవ్వడంలో ఆయన చేసిన కృషి అపారమైనది.

శాతవాహనుల కాలం నుండి కాకతీయుల వైభవం వరకు తెలంగాణ చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేసిన ఆయన, ఈ ప్రాంతం యొక్క ప్రాచీనతను, వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. కాకతీయుల కాలంలో అభివృద్ధి చెందిన శిల్పకళ, నీటిపారుదల వ్యవస్థలు, సామాజిక నిర్మాణాలను ఆయన విశ్లేషణలో స్పష్టంగా వివరించారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రాంతం చారిత్రకంగా వెనుకబడినదని ఉన్న అపోహలను ఆయన ఖండించారు. ఆయన పరిశోధనలు తెలంగాణ స్వాభిమానాన్ని బలపరిచే దిశగా సాగాయి. రాజకీయంగా ఆయన ఎప్పుడూ పదవుల కోసం ప్రయత్నించలేదు. తన ఆలోచనల ద్వారా, రచనల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేయ డానికే ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఆయన ప్రభుత్వానికి చారిత్రక వారసత్వ పరిరక్షణపై సూచనలు అందించారు.

దేవాలయాల సంరక్షణ, శాసనాల పరిరక్షణ, చారిత్రక కట్టడాల అభివృద్ధిపై ఆయన సూచనలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. చరిత్రను కేవలం గతానికి పరిమితం చేయకుండా, భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. రమణయ్య గారి రచనలు ఒక మేధో సంపద. ఆయన రచనలు చదివిన ప్రతి ఒక్కరికి చరిత్రపై ఒక కొత్త అవగాహన ఏర్పడు తుంది. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదా యాలపై ఆయన చూపిన గౌరవం ఆయన వ్యక్తిత్వానికి ప్రతిబింబం.

డాక్టర్ రమణయ్య మరణం ఒక వ్యక్తి కోల్పోవడం మాత్రమే కాదు. ఇలాంటి మహనీ యునికి నివాళి అర్పించడానికి ఆయన చూపిన మార్గంలో నడవడం, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మాత్రమే నిజమైన మార్గం. చరిత్రను సంరక్షించడం, పరిశోధనను ప్రోత్సహించడం, సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడం-ఇవే ఆయన మనకు ఇచ్చిన సందేశాలు. తెలంగాణ గడ్డపై పుట్టిన ఈ మహామేధావి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# కళ్యాణానికి ముస్తాబైన వాడపల్లి వెంకన్న

కోనసీమ 'తిరుపతి'గా 'ఏడు వారాల వెంకన్న'గా ఖ్యాతిగాంచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, వాడపల్లి, కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలంలో గోదావరి వడ్డున ఉన్న ప్రశాంతమైన గ్రామం. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి తీర్థ మహోత్సవాలు ఏటా ఘనంగా జరుగుతాయి.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తూర్పు గోదావరి జిల్లాలో వాడపల్లి గ్రామం, గోదావరి నది ఒడ్డున ఉంది. ప్రసిద్ధి చెందిన వాడపల్లి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్నారు. గౌతమీ తీరంలో కొలువున్న ఈ స్వామిని దేవర్షి నారదుడే ప్రతిష్ఠింప చేశాడంటారు. పురాతన చరిత్రగల ఆలయాలలో ఇది ఒకటి. వెంకటేశ్వర స్వామి దేవత ఎర్రచందనం చెక్కతో చేయబడింది. వాడపల్లి వెంకన్న దేవాలయం రావులపాలెం నుండి 10 కి.మీ. శ్రీ వేంకటేశ్వర స్వామిని కల్యాణ వెంకటేశ్వర స్వామి అని కూడా అంటారు.

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర వారి స్వయంభు క్షేత్రం. వాడపల్లి క్షేత్రం రాజమండ్రి (రాజమహేంద్రవరం) కి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. గౌతమీ నదీ తీరాన వెలసిన స్వామిని భక్తులు తమ పాలిట కొంగు బంగారంలా విశ్వసిస్తారు. ఇది ఒక చారిత్రాత్మక దేవాలయం, తరువాత విశాలమైన ప్రదేశంలో అభివృద్ధి చేయబడింది.

ఈ క్షేత్రంలో ఏడు శనివారాలు దర్శించుకుని, ఏడు ప్రదక్షిణలు చేసిన భక్తులకు కోరిన కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి శనివారం ఇక్కడకు భక్తులకు వేలాదిగా తరలి వస్తారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించు కుంటారు. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి నిలువెత్తు



రూపం చూడగానే కళ్ళకు ఆకట్టుకుని ఏడు కొండల స్వామిని దర్శించిన అనుభూతి కలిగిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలో రావులపాలెం నుండి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాడపల్లికి బస్సులు, ఆటోలు మొదలైన వాటి ద్వారా చేరుకోవచ్చు. ఆలయం 6 నుండి 12 వరకు మరియు సాయంత్రం 4 నుండి 7 వరకు తెరిచి ఉంటుంది. ఆలయం వద్ద యాత్రికుల కోసం ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నదానం చేస్తారు. ప్రధాన ఆలయం పక్కన, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి (శివ) దేవాలయం ఇక్కడ ఉంది. ఆలయానికి ఎదురుగా గరుడ, గజ మరియు అనేక ఇతర స్వామి వాహనాలను మనం చూడవచ్చు. భారత దేశంలో అశేష భక్తజనం సందర్శించే ఆరాధ్య దేవాలయాలలో వాడపల్లి ఒకటి. వాడపల్లి తీర్థం అనగా వాడవాడలా ఉత్సవమే. ఆబాల గోపాలానికి ఆనందమే. ప్రతియేటా చైత్రశుద్ధ ఏకాదశినాడు శ్రీ స్వామి వారి తీర్థం కళ్యాణోత్సవము వైభవముగా జరుగుతాయి. ఉత్సవాలు చూడడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు తరలివస్తారు.

ఈ ఏటి ఉత్సవాలలో భాగంగా మార్చి 29న ఏకాదశి ఆదివారం స్వామివారి తీర్థం, రథోత్సవం, రాత్రి కల్యాణం, 30 ద్వాదశి సోమవారం స్వామివారి పొన్న వాహన మహోత్సవం, 31 త్రయోదశి మంగళ వారం సద్యసం, ఏప్రిల్ 1 చతుర్దశి బుధవారం గౌతమి గోదావరి నదీలో తెప్పోత్సవం, ఏప్రిల్ 2 పౌర్ణమి గురువారం మహా పూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం, 3 కృష్ణ పక్ష పాడ్యమి శుక్రవారం స్వామివారి శ్రీపుష్ప యాగముతో కల్యాణోత్సవాలు ముగియ నున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవల్లి రాజేశ్వర ప్రసాద్ చార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

**- ఆర్‌కేఎస్**

# యువతలు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలి

- **టీజేఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి**



సంగారెడ్డి, మార్చి 28 మనం ప్రతినిధిః క్రీడాభివృద్ధిలో భాగంగా , స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ పార్క్ ఉన్న స్విమ్మింగ్ పూల్ను శనివారం టీజేఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజేఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ పూల్ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ చై కూన వనిత సంతోష్ మాట్లాడుతూ. సుమారు పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్ సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పూల్ను మరమ్మతులు చేయించి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలకు మెరుగైన క్రీడా వసతులు కల్పించడం తమ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా సదుపాయాలు అభివృద్ధి చేస్తామని తెలిపారు. యువజన సంక్షేమశాఖ మరియు స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ... పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తుందని పేర్కొన్నారు. స్విమ్మింగ్ పూల్ను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుతూ నెలవారీ, మూడు నెలల, ఆరు నెలల కార్డుల రూపంలో రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి వయస్సు వారికి అనుకూలంగా సమయాలను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, యువత పాల్గొనాలని అఖిలేష్ రెడ్డి కోరారు. స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, కౌన్సలర్స్ , ప్రజాప్రతినిధులు , క్రీడాభిమానులు ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ



మహాదేవపూర్,మార్చి 28(మనంన్యూస్)ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని సూరారా గ్రామంలో నాలుగవ వార్డ్ లో దాసరి లక్ష్మి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శనివారం రోజున సర్పంచ్ మేకల శంకరమ్మ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామపంచాయతీపరిధిలోఇందవమ్మ ఇంటిలబ్ధిదారుఅయినా దాసరి లక్ష్మి ఇంటి నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మేకల శంకరమ్మ మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గంతో కలిసి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగింది. అనంతరం సర్పంచ్ మేకల శంకరమ్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులు సత్వరమే భూమి పూజలు నిర్వహించి ఇంటినిర్మాణ పనులను ప్రారంభించారని స్వంతింటి కలను తొందరగా నెరవేర్చుకోవాలని గ్రామ ప్రజలను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్ల చిన్నన్న, సూరారం గ్రామ కార్యదర్శి బండం అంజలి, మరియు నాయకులు మడక ప్రతాపరెడ్డి,ఉడేటి లక్ష్మారెడ్డి, మహేష్, రవి సాగర్ తో పాటు పలువురు ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని సందర్శించిన సర్పంచ్



మహాదేవపూర్ మార్చి28మనం న్యూస్ః మహాదేవపూర్ మండల కేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న ఎస్సీ షెడ్యూల్ కులాలభవనాన్ని శనివారం రోజునగ్రామ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ సందర్శించారు.ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు భవన ప్రస్తుత పరిస్థితిని వారు క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దళిత వర్గాల సామాజిక, సాంస్కృతిక అవసరాల కోసంనిర్మించిన ఈ భవనం పాడవకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే మైనర్ రిపేరింగ్ పనులకు నిధులు కేటాయించి, భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని, పేద వర్గాల అభ్యున్నతికి తమ పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్, వార్డు సభ్యులు నల్ల భూగ సమ్మయ్య గడ్డం స్వామి, పడాల మొగిలి, చీర్లవంచ చంద్రశేఖర్, మహమ్మద్ బిన్ అలీ, మరియు దళిత సంఘం సీనియర్ నాయకులు లింగాల రామయ్య, మెరుగు లక్ష్మణ్ తో పాటుతదితరులు పాల్గొన్నారు.


# ఉద్యాన పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానంతో లాభాలు

- **ఉద్యమ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి**




ములుగు, మార్చి 28(మనంన్యూస్)ః రైతుల ఆధునిక పరిజ్ఞానాన్ని సాగులో వాడినప్పుడే ఉద్యాన పంటలన ఖర్చులు తగ్గి, నికరాదాయాలు లభిస్తాయని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సర్ డాక్టర్ దండా రాజి రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కింద రైతు విజ్ఞాన యాత్రను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఉద్యాన ఆధారిత పరిశ్రమలు నెలకొల్పేందుకు పరిశ్రమలు ఎదురు చూస్తుండడంతో భవిష్యత్తులో ఉద్యాన పంటలకు మరింత ఆదరణ ఉంటుందని ఆయన అన్నారు. మహారాష్ట్రలోని భారామతి జిల్లాలోనీ ప్రముఖ కృషి విజ్ఞాన కేంద్రం నీ సందర్శించి రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు గాను పెద్దపల్లి జిల్లా నుండి బయలుదేరారు. కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట రమేష్ నేతృత్వంలోని 40 మంది రైతుల బృందం బయలుదేరింది. కొన్ని సంవత్సరాలుగా మేరైన వర్షాల వల్ల వరి, పత్తి అధికంగా రైతులు సాగు చేస్తున్నారని అయితే ఎల్ నినో నేపథ్యంలో అన్ని పంటలతో పోలిస్తే కూరగాయలు సాగే తక్కువ నీటితో సాధ్యమని అన్నారు. గోదావరి, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట పరిధిలోని భూముల్లో సారవంతంగా ఉండడం, అలాగే నీటి లభ్యత పుష్కలంగా ఉండడంతో ఈ ప్రాంతంలో కూరగాయల సాగు ఇంకా లాభదాయకమని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. రైతులు రసాయన పురుగుమందుల అవశేషాలు తగ్గించేందుకు స్థానికంగా లభించే వనరులతో జీవ సిలింద్ర నాశనలు, అలాగే జీవన ఎరువులు తయారు చేసుకుని వాడుకోవచ్చని తెలిపారు. బిందు సేద్య పద్ధతి ఉపయోగిస్తే తక్కువ నీటితో వేసవి కాలంలో సైతం ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేసుకోవచ్చు అని తెలిపారు. సంప్రదాయ మూస ధోరణి పద్ధతులకు భిన్నంగా ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులు అంది పుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డా. జే చీనా, విస్తరణ సంచాలకులు డాక్టర్ టి సురేష్ కుమార్, కన్సల్టెంట్ డాక్టర్ కే. వీరాంజనేయులు, ఓఈ కోఆర్డినేటర్ డాక్టర్ కె. రమేష్, ప్రొఫెసర్ పిడిగం సైదయ్య, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిధుల కోసం ఎమ్మెల్యే వరస విజ్ఞప్తులు



సంగారెడ్డి, మార్చి 28 (మనం ప్రతినిధి)ః సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర మంత్రివర్గాన్ని చెందిన పలువురు మంత్రులను వరుస లేఖ రాసి కీలక నిధులు మంజూరుకు కోరారు. మొదటగా సంగారెడ్డి లో నిర్మాణంలో ఉన్న మినీ హజ్ హౌస్ పూర్తి చేయడానికి అదనంగా రెండు కోట్లు మంజూరు చేయాలని మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కోరారు ప్రారంభంలో మంజూరైన నిధులు పూర్తిగా వినియోగించినప్పటికీ పెరిగిన వేయాల కారణంగా నిధులు అవసరమని పేర్కొన్నారు అలాగే సదాశివపేట మండలంలో నిర్మాణంలో ఉన్న కొత్త ఎంపీపీ భవన పనులు పూర్తి చేయడానికి అదనంగా కోటి రూపాయలు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కు విజ్ఞప్తి చేశారు ప్రస్తుతం మొదటి అంతస్తు స్లాబ్ వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయని తెలిపారు ఇంకా సంగారెడ్డి నియోజకవర్గంలో రహదారి అభివృద్ధి పనులు సంబంధించి ఎస్బిఐ ఎంఆర్ఆర్ నిధులు తిరిగి మంజూరు చేసి విడుదల చేయాలని కోరారు 27 రహదారి ప్రాజెక్టుల్లో కేవలం 6 మాత్రమే పూర్తవగా మిగిలి న రద్దు అయ్యాయని తెలిపారు ఎమ్మార్ ఆర్ ఆర్ కింద అనేక పనులు పెండింగ్ బిల్లులు కారణంగా నిలిచిపోయానని వివరించారు ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి రద్దయిన పనులను తిరిగి మంజూరు చేస్తే అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

# రెండు రోజుల్లో అందుబాటులోకి డయాలసిస్ సేవలు

- **చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి**
- **విద్యుత్ సమస్య పరిష్కారం కోసం రూ.50 వేలు అందజేత**
- **డయాలసిస్ రోగులకు నేనున్నానంటూ చైర్పర్సన్ భరోసా**



చేవెళ్ల, మార్చి 28 (మనం న్యూస్) : రెండు రోజుల్లో డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దయాలసిస్ రోగులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని...ఆమె వెంటనే చేవెళ్లలోని డయాలసిస్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ డయాలసిస్ రోగులు వారు పడుతున్న కష్టాలను చైర్ పర్సన్తో చెప్పుకున్నారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తం 30 మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు తెలిపారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణంతో పటాన్వెరు దయాలసిస్ కేంద్రానికి ముగ్గురు, శంషాబాద్ కేంద్రానికి 9, వికారాబాద్ డయాలసిస్ కేంద్రానికి 18 మంది పేషెంట్లను తరలించడం జరిగిందని రోగులు తెలిపారు. షాద్ నగర్ కు రోగులను తరలిస్తే అక్కడ డయాలసిస్ చేయడం లేదని ఆరోపించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నెల రోజులుగా ఆర్ఎఫ్ఎ టెస్ట్ చేయడం లేదని, దీంతో ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్కు వెళ్లడంతో ప్రతీ సారి 2 వేల వరకు ఖర్చు అవుతుందని వాపోయారు. కొత్త పేషెంట్లకు డయాలసిస్ చేసేందుకు పిస్టులా అవసరం ఉంటుందని, దీనికి ప్రత్యేక వైద్యుడు (సెఫ్రాలజిస్టు) అవసరం కానున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ. 15-20 వేల వరకు తీసుకుంటున్నట్లు చెప్పారు. నెఫ్రాలజిస్ట్ ను ఏర్పాటు చేయాలని కోరారు. బహుదూరంలో ఉన్న పటాన్ చెరు, శంషాబాద్, వికారాబాద్, డయాలసిస్ కేంద్రాలకు వెళ్లేందుకు ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుందని తెలిపారు. అక్కడ రోగులకు డయాలసిస్ చేసిన తర్వాత తమకు డయాలసిస్ చేస్తున్నారని, రాత్రి 8 గంటలకు డయాలసిస్ స్టార్ట్ చేస్తే 12 అవుతుందని, దీంతో ఇంటికి వచ్చే పరిస్థితి లేక అక్కడే రాత్రి ఉండాల్సి వస్తుందన్నారు. దోమలకు నిద్ర పట్టక రాత్రంతా జాగారం చేసి తిరిగి మరుసటి రోజు ఇంటికి చేరుకుంటున్నట్లు చెప్పారు. రోగుల సమస్యలను సానుకూలంగా విన్న చైర్పర్సన్ వెంటనే ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డయాలసిస్ నిర్వహకులు సమీర్ కు ఫోన్ చేసి పరిస్థితిని తెలుసుకున్నారు. ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని, కేబుల్ వైరు కట్ కావడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయిందని ఆసుపత్రి సూపరిండెంట్ తెలిపారు. ముందస్తుగా కరెంట్ కేబుల్ వైరు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమయ్యే ఖర్చులను తాను భరించనున్నట్లు తెలిపారు. వెంటనే రూ. 50 వేల నగదును అందించారు. రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరించి చేవెళ్లలో డయాలసిస్ సేవలను అందు బాబులోకి తీసుకు రావాలని ఆమె ఆదేశించారు.ఆమె వెంట సీఐ భూపాల్ శ్రీధర్,ఎస్సైలు శిరీష,తేజశ్రీ, బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణాగౌడ్,కందాడ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తరులున్నారు.

## వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమం ముగింపు

దుగ్గొండి, మార్చి 28 (మనం న్యూస్)ః దుగ్గొండి మండలంలోని వార్డు సభ్యుల కోసం నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా పూర్తయింది. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల పనితీరు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, నిధుల వినియోగం, పారిశుధ్యం, అభివృద్ధి ప్రణాళికలపై వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి లెక్కల అరుంధతి,మండల పంచాయతీ అధికారి ఎం. శ్రీధర్ గౌడ్, ట్రైనింగ్ టిఓటి లు ఎం. నరేష్ రాజు పాల్గొని శిక్షణ ఇచ్చారు. మండలంలోని వార్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని అధికారులు సూచించారు.

## ఆధ్యాత్మిక ఆర్యవైశ్య కుటుంబం ఆధ్వర్యంలో అన్నదానం

- **డాక్టర్ రాచకొండ శ్రీనివాస్, నాగరత్నల ఔధార్యం**



జగిత్యాల, మార్చి 27 (మనం న్యూస్)ః జగిత్యాల ఆధ్యాత్మిక ఆర్యవైశ్య కుటుంబం ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్. రాచకొండ శ్రీనివాస్-డాక్టర్.నాగరత్న దంపతుల సౌజన్యంతో అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగిత్యాల పట్టణ సిఐ కరుణాకర్ హాజరై అన్నదానం ప్రారంభించారు. వాసవి మాత జన్మ నక్షత్రం తో పాటు శ్రీరామ నవమి శుభదినం రెండూ ఒకే రోజు రావడం ఈ సందర్భంగా 300 మందికి దాతల సహకారంతో అన్నదానం చేశామని ఆధ్యాత్మిక కుటుంబం నిర్వాహకులు సూర శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసెట్టి ప్రభాకర్, యాంసాని శ్రీనివాస్, ఎలిమిల్ల సాగర్, జిల్లా ప్రకాష్, రాయాంచ హరీష్, గుడిసె భద్రయ్య, మోటూరు సంపత్,మంచాల లచ్చన్న, కట్కూరి చంద్రమౌళి, అశోక్, సత్తన్న, సంపత్, రమేష్, కృష్ణ, శ్రీనివాస్, మహేష్, సూర్య ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

# ఇండియన్ ఆర్మీలో చేరండి

- **భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాల కోసం 2027 రిక్రూట్మెంట్**
- **అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**




సంగారెడ్డి, మార్చి 28 మనంప్రతినిధిః భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాల కోసం రిక్రూట్మెంట్ 2027 సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైందని, ఆసక్తి కలిగిన యువత ఇండియన్ ఆర్మీ అధికారిక వెబ్సైట్ జాయిన్ ఇండియన్ ఆర్మీ పోర్టల్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్బులు. జాయిన్ ఇండియా ఆర్మీ. ఎన్ ఐ సి . ఇన్ ) ద్వారా ఫిబ్రవరి 2026 నుండి 01 ఏప్రిల్ 2026 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు అధికారిక నోటిఫికేషన్ను పూర్తిగా చదవాలని, అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే, ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలు, వైద్య పరీక్షలు వంటి దశలు ఉంటాయని తెలిపారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, దేశసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. యువత శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిత్య వ్యాయామం, పరుగు, ఆరోగ్యకరమైన ఆహారం అలవాటు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షల తేదీలు మరియు ఇతర పూర్తి వివరాల కోసం పై అధికారిక వెబ్సైట్ను సందర్శించగలరని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. విద్యార్హతలు:' అభ్యర్థులు 10వ తరగతి / మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. 5 ప్రధాన విషయాలలో మొత్తం 45% మార్కులు ఉండాలి. ప్రతి విషయానికి కనీసం 33% మార్కులు తప్పనిసరి. అర్హతలు:' వయస్సు: 17ట నుండి 22 సంవత్సరాల మధ్య ఉండాలి.ఎత్తు: ప్రాంతానుసారం నిర్దేశిత ప్రమాణాలు వర్తిస్తాయి.

# జామా మసీదు కమిటి నూతన పాలకవర్గం ఎన్నిక



ములుగు,మార్చి 28మనం ప్రతినిధి : జిల్లా కేంద్రంలో జామ మసీదు నూతన కమిటీని శనివారం ఎంపిక చేశారు. జామ మసీదు నూతన కమిటి అధ్యక్షులుగా అబ్దుల్ రబ్ బిన్ హైమద్ నియమించగా వారిని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు వంగ రవి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జామ మసీదు కమిటి అధ్యక్షులు అబ్దుల్ రబ్ బిన్ హైమద్ ఉపాధ్యక్షులు అబ్దుల్ హఫీజ్ బాబా కార్యదర్శి: ఎండి. అఫ్రోజ్, ఉప కార్యదర్శి ఎండి. షర్ఫుద్దీన్, కోశాధికారి ఎండి. హాజీ పాషా, సభ్యులు ఎండి. మన్సూర్ అలీ, ఎండి. నజీరుద్దీన్ బాబ్, ఎండి. అన్వర్ పాషా, ఎండి. ఖయ్యూమ్ నియమితులవ్వగా వారికి అభినందనలు తెలియజేశారు. అలాగే జామా మసీదు కమిటి కోసం కృషి చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ - రియాజ్ మీర్జా, కౌన్సిలర్ కుత్బుద్దీన్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ములుగు మండలం మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ షకిల్, ములుగు మండల బీసీ సెల్ అధ్యక్షులు ఓంప్రకాష్, ములుగు మండలం మహిళా అధ్యక్షురాలు గుంటోజు పావని, జిల్లా కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ రవికుమార్, మాజీ ఎంపీటీసీ మావరపు తిరుపతిరెడ్డి, లావుడియా రమేష్, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి ఓడ రాజు, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి జయకర్, శంకరయ్య చారి, బొజ్జల కుమార్, సలీం, నిరంజన్ చారి, మాదారపు రాజు, ఓరుగంటి అనిల్, గుగ్గిల సృజన్, తణుకుల విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సురేంద్రబాబుకు సన్మానం



ములుగు,మార్చి 28మనం ప్రతినిధిః మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిల్లా ప్రచార కమిటీ చైర్మెన్ పూజరి సురేందర్ బాబును యూత్ కాంగ్రెస్ మండల అద్యక్షుడు మురుకుట్ల నరేందర్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానము చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి సభ్యునిగా అవకాశం దొరకడం సంతోషకరమన్నారు నియమకానికి సహకరించిన అదిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేందర్, ఎన్ ఎస్ యుఐ అద్యక్షులు బోడ జయరాజ్, జిల్లా యూత్ నాయకులు బాసరికారి నాగార్జున,ఎడ్ల నరేష్ మండల నాయకులు మద్దెల ప్రవీణ్, మూగల చంటి,బూర్గుల సతీష్, గోమాసు లక్ష్మి నారాయణ, జాడి మురళి గోమాసు నర్సింహరావు పాల్గొన్నారు.

# గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా వ్యాప్తంగా స్కానింగ్ సెంటర్ల పై నిఘా పెట్టండి**

**గర్భిణీ మహిళలు నెల వారీ ఆరోగ్య పరీక్షలకు హాజరుకాని గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించండి...**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...**



**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 28 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలో గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా వైద్య శాఖ అధికారులకు, ఏఎన్ఎంలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గర్భధారణ సమయంలో మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా, ప్రతి నెల నిర్వహించే గర్భిణీ స్త్రీలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఏఎన్ఎంలకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ (లింగ ఎంపిక నిషేధం) చట్టం 1994 , నిబంధనలు 1996 పిసి పి ఎన్ డి టి యాక్ట్ 1994 రూల్స్ 1996 పైన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పీహెచ్ సీల, ఏఎన్ఎమ్ లకు ఒకరోజు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**

జిల్లాలోని ప్రతి గర్భిణీ స్త్రీకి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా హై రిస్క్ గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి, వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. హై రిస్క్ ఉన్న గర్భిణీలకు అవసరమైన ల్యాబొరేటరీ పరీక్షలు, మందులు, పోషకాహార సూచనలు అందించలన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించడంలో ముందస్తు జాగ్రత్తలే అత్యంత కీలకమైందని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు గర్భిణీ స్త్రీలతో నిరంతరం సంబంధం కొనసాగించాలన్నారు. గర్భిణీ స్త్రీలను సమయానికి ఆసుపత్రులకు తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి గర్భిణీ స్త్రీకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య శాఖ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు ప్రతినెల గర్భస్థ ఆరోగ్య పరీక్షలకు హాజరవుతున్నారా లేరా అని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 1వ. 2వ. 3వ. గర్భస్థ పరీక్షల తర్వాత , నెల వారీ ఆరోగ్య పరీక్షలకు హాజరుకాకుంటే అందుకు గల కారణాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఏదైనా అబార్షన్ జరిగిందా అనే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే మొదటి కానుపులో అమ్మాయి పుట్టిన తర్వాత రెండవ గర్భ పరీక్షలు నిర్వహించే వారిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని ఏదైనా స్కానింగ్ సెంటర్లో అబార్షన్లు లింగస్థ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఏఎన్ఎమ్లకు సూచించారు. జిల్లాలో బాలికల శాతం గణనీయంగా తగ్గిందన్నారు. 1000 మంది బాలురకు 894 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ నిష్పత్తి ఇలాగే కొనసాగితే జిల్లాకు చాలా నష్టం వాటిల్లుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్లతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లాలో పుట్టబోయే ఆడ శిష్యుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఆడబిడ్డల నిష్పత్తిని పెంచేలా కృషి చేద్దామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో మాతృ శిశు మరణాలు జరగకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ రకాల రోగులకు నిర్వహించే వైద్య సేవలను సమర్థవంతంగా నిర్వర్తించేలా వైద్యాధికారులు సేవలు అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ , డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ తారా సింగ్, భీమ్లా నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు లక్ష్మణ్, కృష్ణమోహన్, రఫీక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత
- ముస్తాబాద్లోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు
- నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేయడంతో పాటు జైలు శిక్ష తప్పదు



**రాజన్న సిరిసిల్ల, మార్చి 28(మనం ప్రతినిధి ):** జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత హెచ్చరించారు. శనివారం ముస్తాబాద్ మండలంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా స్కానింగ్ సెంటర్లలోని రికార్డులను, యంత్రాలను ఫారం-ఎఫ్ ఆడిట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు: రికార్డుల నిర్వహణ: గర్భిణీ స్త్రీల పూర్తి వివరాలను నమోదు చేసి, వారి సంతకాలను తీసుకోవాలని, స్కానింగ్ వివరాల ఫిలింను తప్పనిసరిగా జతపరచాలని ఆదేశించారు. గర్భిణీలకు పుట్టబోయేది ఆడ లేదా మగ అని సైగల ద్వారా సూచించినా, వివరాలు వెల్లడించినా ఆ సెంటర్లను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి 10,000 జరిమానాతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ రజిత ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఏ సంస్థనైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆమె పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమం లో హెల్త్ ఇన్స్పెక్టర్లు మహేష్ గౌడ్, నవీన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మానేరు రివర్ ఫ్రంట్ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కరీంనగర్, మార్చ్ 28(మనం న్యూస్):** కరీంనగర్ ఎల్.ఎం.డి రిజర్వాయర్ దిగువన నిర్మాణంలో ఉన్న 'మానేరు రివర్ ఫ్రంట్' పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. మున్సిపల్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రివర్ ఫ్రంట్ బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణ అంచనా వ్యయం, పూర్తిచేసిన పనుల వివరాలు, చేయవలసిన నిర్మాణాలు తదితర అంశాలను అధికారులు వివరించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణంలో భాగంగా టూరిజం అభివృద్ధి నమూనా, పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఏయే నిర్మాణాలు.. ఎంత విస్తీర్ణంలో.. ఎక్కడ చేపడుతున్నారని విషయాలను గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. నది లోతు, ఇరువైపులా కట్ట నిర్మాణం ఎత్తు, ప్రైవేటు, ప్రభుత్వ భూమి సేకరణ వంటి వివరాలను అడిగారు. నదికి ఇరువైపులా చేపట్టబోయే పలు అభివృద్ధి పనుల గురించి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, నీటిపారుదల శాఖ ఎస్ ఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి

- వచ్చే నెల ఏప్రిల్ 2న. గ్రామ సభలను విజయవంతం చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 28 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఏప్రిల్ 2న. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డుల్లో సభలు విధిగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు సదుపాయాలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల వివరాలను గ్రామ, వార్డుల వారీగా సభలలో వెల్లడించాలని కలెక్టర్ తెలిపారు. అందుకు అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో శాఖల వారీగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాల నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా, సభలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాలని, ప్రజలకు సౌకర్యం కల్పించే విధంగా షామియానాలు ఏర్పాటు చేయమని డిపిఓ శ్రీరాములు ను ఆదేశించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను అందజేయాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో లాభదాయక పంటలు, ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుంచి వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు. అందువల్ల, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలను విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రణాళికల ప్రకారం ప్రతి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. జిల్లా ప్రజలకు సభలకు సమయానికి హాజరై, స్థానిక సమస్యల పరిష్కారంలో పాలుపంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీరాములు, డిఆర్డిఏ పిడి చిన్న ఓబులేష్, డీఈఓ రమేష్ కుమార్, డిటిఓ చిన్న బాలు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ డి.ఎస్.పి శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గం



**రంగారెడ్డి, మార్చి 28 (మనం న్యూస్):** కేసుల పరిష్కారానికి లోక్ పదాలతో ఉత్తమ మార్గమని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి , రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణ కుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో గల అన్ని కోర్ట్ ప్రాంగణాలలో శనివారము జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడమైనది.కర్ణ కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ లోకాదాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోకదాలత్ లో సెటిల్ చేసుకోవడం ద్వారా తాము సివిల్ కేసులలో చెల్లించిన కోర్ట్ ఫీస్ కూడా తిరిగి పొందొచ్చు అని చెప్పారు. తమ కేసులను అనగా ఆస్తి పరమైన , కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్ మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి / సీనియర్ సివిల్ జడ్జి అనూష మాట్లాడుతూ రంగా రెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాలలో 22 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు ,సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్స్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకొన్నారు అని చెప్పారు. ఈ లోక్ అదాలత్ నిర్వహించుటలో పోలీస్ వారు, ఇన్సూరెన్స్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పానెల్ అడ్వొకేట్స్ మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తమవంతు సహాయసహకారాలను అందించారు కక్షిదారులు సంతోషం వ్యక్త పరిచారు. ఇట్టి జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కక్షిదారులకు ఉచితంగా భోజనాన్ని అందించింది. రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాదభీమా కేసులు, బ్యాంకు రికవరీ మరియు ప్రీటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 1,20,000 పై చిలుకు కేసులు పరిష్కరించబడ్డాయి.

అన్ని కేసులలో కలిపి రూ.8,32,49,040 రూపాయల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగింది.

# జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

- డీఈఓ రమేష్ కుమార్



**ఉమ్మడి మహబూబ్ నగర్, మార్చి 28 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ అన్నారు. శనివారం కల్వకుర్తి, తాడూర్, మండలాలోని కల్వకుర్తి జేపీ నగర గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తాడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీఈవో రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను, సీసీ కెమెరా వ్యవస్థను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, బందోబస్తు, తాగునీరు, ప్రథమ చికిత్స వసతి తదితర విషయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలకుండా ఏర్పాటు చేయాలని డిఇఓ అధికారులు ఆదేశించారు. శనివారం జరిగిన గణిత పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 60 పరీక్షా కేంద్రాల్లో 10650 మంది విద్యార్థులకు గాను 10630 మంది విద్యార్థులు నేటి గణిత పరీక్షకు హాజరు కాగా 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. 99.81 % హాజరు శాతం నమోదయిందన్నారు. అదేవిధంగా ఆరు మంది ప్రైవేటు విద్యార్థులకు గాను విద్యార్థులు నేటి పరీక్షకు 6 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



**రంగారెడ్డి, మార్చి 28 (మనం న్యూస్):** గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం కానిస్టేబుల్స్ సందీప్ రెడ్డి , రవి లు డ్యూటి లో వుండగా రాత్రి: 11:00 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 100 కాల్ చేసి ఒక గుర్తు తెలియని వ్యక్తి ( 40) సంవత్సరాలు కర్మంఘాట్, మందమల్లమ్మ రోడ్డులో వున్న దుర్గా భవానీ వైన్స్ దగ్గరలో ఫిట్స్ వచ్చి పడిపోయినాడు అన్న సమాచారము వచ్చిందని తెలిపారు. సమాచారం అందగానే సిబ్బంది అక్కడికి చేరుకొని వ్యక్తిని చికిత్స గురించి ఉస్మానియా హాస్పిటల్ లో చేర్పించారు.

చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకుంటూ తెలిపారు.

# మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత

- ఉద్యమనేత ఎన్ టి వి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామన్ననాయక్




**మహబూబాబాద్, మార్చి 28 (మనంన్యూస్):** గూడూరు మండలం లోని ఏపూరు గ్రామం టేకులతండాకు చెందిన కాంగ్రెస్ మండల యూత్ నాయకులు అవుల సందీప్ రెడ్డి తల్లి ఆవుల రామ (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాగా వారి కుటుంబానికి తెలంగాణ ఉద్యమ కారుడు ఎన్టీవిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రామన్న నాయక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియపరిచరు వారి కుటుంబనికి 50 కిలోల బియ్యని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుల కుటుంబానికి ఎన్నివేళల అండగా ఉంటానని మనోధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోత్ చందా, కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు బానోత్ ఈశ్వర్ మాజీ వార్డు సభ్యులు బానోత్ జయరాం ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ చందు నాయక్ అజ్మీరా ఈశ్వర్ యూత్ నాయకులు బానోత్ తరుణ్ వంకుడోత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట కళ్యాణోత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన



**తిరుపతి, మార్చి 28 మనం న్యూస్:** ఏప్రిల్ 1వ తేదిన ఒంటిమిట్టలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణం ఏర్పాట్లపై శనివారం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్, టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో కళ్యాణ వేదిక, హెలిప్యాడ్, ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అదనపు ఈవో, జిల్లా కలెక్టర్ కలిసి టీటీడీ, జిల్లా అధికారులతో ఆలయ సమీపంలో ఉన్న సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో అధికారులతో మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయం చేసుకుని సమిష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. భక్తులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేయాలని చెప్పారు. ఏర్పాట్లపై భక్తుల నుండి విభాగాల వారీగా అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు. ప్రతి చిన్న సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యాచరణ సమర్థవంతంగా ఉండేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ శ్రీ సీతారాముల కళ్యాణాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, పోలీసు, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, వైద్య, ఏపీఎస్ఆర్టీసీ, ప్రజా సంబంధాల శాఖ తదితర వివిధ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కళ్యాణోత్సవానికి పూర్తి సన్నద్ధతతో సమాయత్తంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రతకు భక్తులు డీహైడ్రేషన్ కు గురయ్యే అవకాశం ఉండటంతో వైద్యులు ముందు జాగ్రత్తగా అందుకు తగిన విధంగా మందులు, అంబులెన్సులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ, జిల్లా, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## ఏం అచ్చెమ్మ అత్త బాగున్నావా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనురాగ పలుకరింపు

**దమ్మపేట, మార్చి 28(మనం న్యూస్):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో శనివారం ఉదయం ఆసక్తికరమైన సంఘటన జరిగింది. మంత్రి తుమ్మల బాల్యంలో తనను ఆమె భుజాలపై వేసు కొని ఆడించిన అచ్చెమ్మ అత్తను చూడగానే ఆయన ఆప్యాయత కురిపించారు. అచ్చెమ్మ అత్త బాగున్నావా .అంటూ పలకరించారు. అచ్చెమ్మ అత్త ఏమైనా పనిమీద వచ్చావా అని మంత్రి తుమ్మల అడగగా లేదు బాబు నిన్ను చూసి చాలా కాలం అయినది. బాగా చూడాలనిపించింది.అందుకే వచ్చాను అంటూ ఆమె సమాధానం ఇచ్చారు. వీరు ఇద్దరి మధ్య అలనాటి బాల్య విశేషాలు ముచ్చటిస్తూ ఆమెతో మంత్రి తుమ్మల సరదాగా కాసేపు గడిపారు.

# శభాష్ దామోదర్ సాబ్..

### శ్రీరామ నవమి ఏర్పాట్లు పై భక్తుల ప్రశంసలు
### ఒక్క వివాదం కూడా లేకుండా ఉత్సవాలు విజయవంతం
### గ్యాస్ కొరత ఉన్నప్పటికీ 3 లక్షల లడ్డూలు....
### 40 వేల మందికి అన్నదానం





**భద్రాచలం, మార్చి 28( మనం న్యూస్):** దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ముఖ్యమైన పండగలు శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు. ఈ ఉత్సవాలు నిర్వహించే దేవస్థానం కార్యనిర్వహణాధికారి పాత్ర అత్యంత కీలకం. ఉత్సవాలు విజవంతంగా ముగిసాయా లేదా అనేది వారి నిర్వహించిన విధులు పట్ల, భక్తుల నుంచి వచ్చే స్పందన బట్టి తెలుస్తుంది. శుక్రవారం, శనివారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగిన శ్రీరామ నవమి, మహా పట్టాభిషేకం వేడుకలు విజయవంతంగా ముగిసాయి. భక్తులు కూడా దేవస్థానం చేపట్టిన సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్సవాలు విజయవంతంగా కావటానికి కార్యనిర్వహణాధికారి దామోదర్ రావు ప్రధాన కారకులు. ఉత్సవాలకు నెల రోజులు ముందు నుంచి దేవాలయంలో పని చేసే సిబ్బందికి వారి విధులు పట్ల పలు సూచనలు ఇస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఉద్యోగుల్లో ఒక బాధ్యతను గుర్తు చేస్తూ, నవమి, పట్టాభిషేకం రెండు ఉత్సవాల్లో భక్తులకు, అధికారులకు, వీఐపీ లను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాలని, ఎలాంటి వివాదాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి ,మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనే ఈ ఉత్సవాల్లో దేవస్థానం నుంచి ఎలాంటి విమర్శలు రాకూడదని అనేక సమావేశంలో చెప్పినట్లుగా తెలిసింది. అంతే కాకుండా దాతలు సహకారం అందించే విధంగా కృషి చేసారు. అందులో భాగంగానే ఇంత పెద్ద ఉత్సవాల్లో దేవాలయం నుంచి ఒక్క వివాదాస్పద వ్యాఖ్యలు భక్తుల నుంచి రాలేదు. ఇటీవల దేశంలో గ్యాస్ కొరత ఉన్నప్పటికీ మూడు లక్షల లడ్డూలు, పులిహార ,చక్ర పొంగలి, సుమారు 40 వేల మందికి అన్నదానం దేవస్థానం నుంచి ఏర్పాటు చేయటం చెప్పుకోదగ్గ అంశం. అన్ని విషయాలను దగ్గరుండి పర్యవేక్షించడం, ఏదైనా లోటుపాట్లు ఉంటే, వెంటనే సరిచేసి పరిస్థితి చక్కదిద్దారు. శ్రీరామన వమి ఉత్సవాలు సందర్భంగా రాష్ట్ర మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాటుచేసిన సమావేశాల్లో వారు కొన్ని సూచనలు, సలహాలను కూడా పాటించి, ఉత్సవాలను విజయవంతం చేయడం లో దేవస్థానం ఈవో దామోదరరావు సఫలీకృతమయ్యారని, భక్తులు, ప్రజలు, అధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- 99 రోజుల ప్రగతి ప్రణాళిక భాగంగా మొక్కలు నాటిన
- ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ పి.కోటేశ్వరరావు

**మణుగూరు, మార్చి 28(మనం న్యూస్):** మణుగూరు మండల పరిధిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ టిపిఎస్ ఎస్పీఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ పి. కోటేశ్వరరావు మొక్కలు నాటారు. స్థానికంగా ఉన్న పేరంటాల చెరువు పరిసరాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు.
అదే సమయంలో పేరంటాల చెరువు వద్ద శుభ్రత కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. చెరువు చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ కార్యక్రమంలో సాంబాయిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉషారాణి,ఉప సర్పంచ్ రమేష్ పాల్గొని వార్డు మెంబర్ల తో కలిసి పేరంటాల చెరువు పరిసరాలను ఎస్పీఫ్ సిబ్బంది కలిసి శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో బి టి పి ఎస్ అసిస్టెంట్ కమాండర్ తిరుపతి, ఇన్స్పెక్టర్ నరసింహారావు,ఎస్త్రు లు రమేష్,చందు అధికారులు ఎస్పీఎఫ్ కానిస్టేబుల్స్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సింగరేణి ఖాళీ స్థలాలు నిరుపయోగం..

- యాజమాన్యం ఉపయోగించుకుంటే కంపెనీకి ఆదాయం
- ఆ దిశగా అడుగులు వేస్తే ఆదాయ మార్గాలు
- ఖాళీ స్థలాల్లో వ్యాపార సముదాయాలు నిర్మించాలి
- నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి






**కొత్తగూడెం సింగరేణి, మార్చి 28(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన ఖాళీ స్థలాలు నిరుపయోగంగా మారాయి. ఖాళీ స్థలాలు గత కొన్ని ఏండ్లుగా నిరుపయోగంగా ఉండడం మూలంగా అందులో పిచ్చి చెట్లు వెలసి దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా స్థలాలు కబ్జాలకు సైతం గురి అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో సింగరేణి స్థలాలు ఆక్రమణలకు గురైనట్లుగా ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా సూపర్ బజార్ ఏరియా, భజన మందిర్ ప్రాంతం, రామవరం, బర్లిఫిట్ ఏరియా, రుద్రంపూర్ ప్రాంతాలలో సింగరేణి కంపెనీ స్థలాలు ఖాళీగా ఉన్నట్లుగా కొంత మంది మాజీ కార్మికులు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతాలలో సింగరేణి యాజమాన్యం ఒక అడుగు ముందుకేసి వ్యాపార సముదాయాలను నిర్మిస్తే వాటి ద్వారా ఆదాయం రావడంతో పాటు నిరుద్యోగులకు సైతం ఉపాధి కలుగుతుందని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

**ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్ వేసి వదిలేస్తే ఎలా..?**

సింగరేణి కాలరీస్ కంపెనీ ఖాళీ స్థలాలకు ఇటీవల ఫెన్సింగ్ వేయడం జరిగింది. స్థలాలకు కేవలం ఫెన్సింగ్ వేసి వదిలేయకుండా ఆ స్థలాలను యాజమాన్యం ఉపయోగించుకోవాలని కార్మిక సంఘాలు సూచిస్తున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే స్థలాలకు ఫెన్సింగ్ వేస్తే వాటిపై కబ్జాదారుల కన్ను పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఖాళీ స్థలాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లకముందే సింగరేణి యాజమాన్యం మేల్కొని ఖాళీ స్థలాల్లో కొత్త భవనాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తే కంపెనీకి ఆదాయ మార్గాలు పెరుగుతాయని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

**వ్యాపార సముదాయాలు నిర్మించాలి..**

సింగరేణి కాలరీస్ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను యాజమాన్యం ఉపయోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఐ ఎఫ్ టి యు కార్మిక సంఘం నేత గొని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖాళీ స్థలాలను నిరుపయోగంగా ఉంచడం మూలంగా కంపెనీకి నష్టం వాటిల్లుతుందని అదే స్థలాలను ఉపయోగంలోకి తీసుకువస్తే సింగరేణి సంస్థకు ఆదాయం చేకూరుతుందని సూచించారు. ఖాళీ స్థలాలను కేవలం ఫెన్సింగ్ లకు మాత్రమే పరిమితం చేయకుండా వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని గొని నాగేశ్వరరావు సింగరేణి కంపెనీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.



## దాతృత్వానికి నిదర్శనం నాళ్ళ నారాయణ దంపతుల విరాళం

**మధిర టౌన్, మార్చి28(మనం న్యూస్):** మధిర పట్టణంలోని రైల్వే రామాలయ పునః నిర్మాణ కార్యక్రమం సందర్భంగా హైదరాబాద్ వాస్తవ్యులు నాళ్ళ నారాయణ పుణ్య దంపతులు ఆలయ నిర్మాణానికి 15 లక్షల రూపాయలు భారీ విరాళం సమర్పించారు. వారి ఈ సేవా భావాన్ని కొనియాడుతూ మధిర రామాలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు గుర్రం రామారావు , ఆంజనేయ స్వీట్ షాపు అధినేత ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని, దాతల సేవలను ప్రశంసించారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయ పునః నిర్మాణానికి సమాజంలోని ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. నాళ్ళ నారాయణ దంపతుల దాతృత్వం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మధిర రామాలయ పునః నిర్మాణ కమిటీ వారు దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజీ మార్గమే రాజమార్గం..

### కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ సువర్ణావకాశం
### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్
### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 12 బెంచీలు ఏర్పాటు



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 28 (మనంప్రతినిధి):** కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శనివారం పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజమార్గమని రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరుపక్షాలు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను పరిష్కరించుకొనుటకు సువర్ణ అవకాశమని తెలిపారు.సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మైంటెనెన్సు కేసులు, బ్యాంక్ రికవరీ మరియు మోటార్ వాహన ప్రమాద బీమా కేసులను ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో రాజీ పడాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కారమైతే కోర్టు ఫీజు తిరిగి చెల్లించబడుతుందని, దీనివల్ల సమయం మరియు డబ్బు రెండూ ఆదా అవుతాయని వివరించారు. ఇక్కడ కేసు పరిష్కారం కావడం వల్ల ఇరు పక్షాల మధ్య శత్రుత్వం పోయి సఖ్యత పెరుగుతుందని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమని, దీనిపై మళ్ళీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పులిహార మరియు మంచినీళ్లు సదుపాయాన్ని ఎస్బిఐ బ్యాంక్ వారి సౌజన్యంతో కల్పించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయ మూర్తి ఎస్. సరితా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, మెజిస్ట్రేట్స్ సుచరిత,బత్తుల రవికుమార్, వినయ్ కుమార్, సాయి శ్రీ, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు కోర్ట్ సిబ్బంది,బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని నడుపుతున్నరా? సర్కస్ నడుపుతున్నరా?

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై జగదీశ్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఛీఛీ ఇంత నిర్లక్ష్యమా? రెండు బుక్‌లు ఒకేలా ఎలా తయారుచేసింద్రు? ఇది ప్రభుత్వానికి అత్యంత సిగ్గుచేటు అంటూ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ప్రాంగణంలో జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. అవుట్ కమ్ బడ్జెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్కు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా కాపీ పేస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

# కృషి, పట్టుదలకి కుటుంబం తోడైతే విజయం సొంతం



**కొణిజర్ల, మార్చి 28 (మనం న్యూస్):** కృషి, పట్టుదలకి కుటుంబం తోడైతే విజయం సొంతమవుతుందని కొణిజర్ల గ్రామానికి చెందిన స్వర్ణ దర్గయ్య కుటుంబం మరోసారి నిరూపించింది. ఈ కుటుంబానికి చెందిన కుమార్తె కావ్య విజ్ఞాన్ యూనివర్సిటీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆమె కు ప్రముఖ ఐటీ సంస్థలు డిలైట్,టిసిఎస్, ఈ-లెర్నింగ్ రంగ సంస్థలో ఒకేసారి ప్లేస్మెంట్ సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె సోదరుడు శ్యామ్ ప్రముఖ సంస్థ అమేజాన్ లో సుమారు రూ.1.30 కోట్ల ప్యాకేజీతో ఎంపిక కావడం విశేషం. అన్నాచెల్లెల్లు ఇద్దరూ సాధించిన ఈ విజయాలు గ్రామంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా చర్చనీయాంశంగా మారాయి. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వీరు తమ కష్టపడి పనిచేసే తత్వం, పట్టుదల, లక్ష్యసాధనపై నిబద్ధతతో ఉన్నత స్థాయికి చేరుకోవడం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది.కావ్య చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి, సమయపాలన, క్రమశిక్షణతో ముందుకు సాగి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంది. నిరంతర సాధన, ఆత్మవిశ్వాసం ఆమె విజయానికి బలమైన కారణాలుగా నిలిచాయి. అదే విధంగా శ్యామ్ కూడా తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని, కఠోర శ్రమతో అంతర్జాతీయ స్థాయి సంస్థలో అత్యున్నత ప్యాకేజీ సాధించడం యువతకు స్ఫూర్తిదాయకంగా మారింది. ఈ విజయాల వెనుక తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. స్వర్ణ దర్గయ్య దంపతులు చిన్నప్పటి నుంచే పిల్లలకు మంచి విలువలు, క్రమశిక్షణ, విద్యపై నిబద్ధతను అలవాటు చేయడం వల్లే ఈ స్థాయి విజయాలు సాధ్యమయ్యాయని అంటున్నారు. పిల్లలపై నమ్మకం ఉంచి, వారికి అవసరమైన ప్రోత్సాహం అందించడం తల్లిదండ్రుల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోంది.కష్టపడితే అసాధ్యం ఏమీలేదు అనే నానుడిని ఈ అన్నాచెల్లెల్లు నిజం చేశారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు అగ్రస్థాయి కంపెనీల్లో ఎంపిక కావడం కొణిజర్ల గ్రామానికి గర్వకారణంగా నిలవగా, స్థానిక ప్రజలు, ఉపాధ్యాయులు, స్నేహితులు వీరిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు

# బెట్టింగ్ వలలో పడితే..విలవిలే..!

- క్రికెట్‌ను క్రీడా స్ఫూర్తితో ఆస్వాదించండి
- ఐపీఎల్‌ను కేవలం వినోదంగా మాత్రమే చూడాలి
- క్రికెట్ బూకీలకు వీసీ సజ్జనార్ వార్నింగ్..



**హైదరాబాద్,మార్చి 28(మనం,ప్రత్యేక ప్రతినిధి):** యువత క్రికెట్ బెట్టింగ్ వలలో పడితే బతుకు ఛిద్రమౌతుందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హితువు పలికారు. నగరంలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రికెట్ బూకీలను వదిలిపెట్టే ప్రసక్తిలేదని హెచ్చరించారు. యువత క్రికెట్ పట్ల అభిమానాన్ని క్రీడా స్ఫూర్తితోనే చాటుకోవాలని సజ్జనార్ సూచించారు. కొందరు క్రికెట్ క్రేజ్ ను ఆసరాగా చేసుకుని బెట్టింగ్‌ల వైపు యువతను ప్రోత్సహిస్తున్నారని.. అది ఒక చిన్న ఆటగా మొదలై, చివరకు బతుకులను ఛిద్రం చేస్తోందని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ వీడియోను రిలీజ్ చేశారు.

**ఆకర్షితులైతే...అంతేగతి :**

క్రికెట్ బెట్టింగ్ అనేది సులభంగా డబ్బు సంపాదించే మార్గంలా కనిపిస్తుంది. కానీ, అది కేవలం ఒక భ్రమ మాత్రమేనని సీపీ వీడియో సందేశం ఇచ్చారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్ ల ప్రకటనలకు ఆకర్షితులై చేతిలో ఉన్న సొమ్మును పోగొట్టుకోవడమే కాకుండా.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. దీని వల్ల వారిని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడతాయని, బెట్టింగ్‌ల వల్ల కేవలం వ్యక్తిగత నష్టమే కాకుండా.. తండ్రి కష్టార్జితాన్ని, తల్లి నగలను తాకట్టు పెట్టి బెట్టింగ్ కాసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయన్నారు. బెట్టింగ్ భూతానికి గౌరవప్రదమైన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు.

**అప్పల పాలై :**

క్రికెట్ బెట్టింగ్‌లలో భారీ ఎత్తున అప్పులు చేసి వాటిని పోగొట్టుకుని ఆ అప్పులను తీర్చలేక, పరువు పోతుందనే ఆందోళనతో ఎంతో మంది యువకులు ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారని సీపీ చెప్పారు. మరికొందరు అప్పులు తీర్చడానికి దొంగతనాలు, మోసాలకు పాల్పడి తమ ఉజ్వల భవిష్యత్తును జైలు పాలు చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఐపీఎల్ అనేది కేవలం వినోదం కోసం ఉద్దేశించిన క్రీడ అని గెలుపోటములు సహజమన్నారు. వాటిని కేవలం టీవీ, స్టేడియంలో చూసి ఆనందించాలే తప్ప, మీ సంపాదనను పందెంగా పెట్టకూడదని హితువు పలికారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత తమ చదువుపై, కెరీర్‌పై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. గతంలో పలు బెటింగ్ యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చిందన్నారు. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం అని సీపీ తేల్చిచెప్పారు.

**డయల్ 100 :**

క్రికెట్ బెట్టింగ్‌లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే కాకుండా ఫామ్ హౌస్లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై డయల్ 100కి కాల్ చేసి సమాచారం అందించాలని సీపీ తెలిపారు. బెట్టింగ్ నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100, వాట్సాప్ నంబర్ 9490616555 కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

**బెట్టింగ్ పంజా :**

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కాగానే బెట్టింగ్ భూతాలు యువతకు వల విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో బెట్టింగ్ నిర్వాహకులు సామాన్యులు, యువత, విద్యార్థులు లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. యువతకు ఆన్‌లైన్‌లో రుణ సంస్థలు అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి బెట్టింగ్‌లకు పాల్పడేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం వందలాది బెట్టింగ్ యాప్లను నిషేధించడంతో ఇప్పుడు నిర్వాహకులు రూటు మార్చారు.

టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ స్టేటస్, ఇన్స్టాగ్రామ్ రీల్స్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ దందా నిర్వహించేందుకు సిద్ధమౌతున్నారు. యువతను బెట్టింగ్‌వైపు ఆకర్షించేందుకు పెయిడ్ ప్రొమోషన్లు కూడా చేయిస్తున్నారు. నగర శివారులలో ఫామ్ హౌస్‌లు కేంద్రంగా బెట్టింగ్ ముఠాలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహిస్తూ యువతను ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నారు. బెట్టింగ్‌లు నిర్వహించిన వారితో పాటు బెట్టింగ్ ఆడినా వారిపైనా కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ముందస్తు హెచ్చరికలు చేశారు.

# ఏప్రిల్ 8న కిసాన్ మేళ




పెనుమంట్ర (న్యూస్ ప్రతినిధి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరు, మరియు జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో ఏప్రిల్ 8వ తేదీన మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ పత్రికా సమావేశంలో తెలిపారు. ఈ కిసాన్ మేళాలో ప్రధానంగా మారుతున్న వాతావరణ మరియు వాణిజ్య పరిస్థితులు - సుస్థిర వరి వ్యవసాయంపై శాస్త్రవేత్తలు రైతులతో క్షేత్ర సందర్శన, వ్యవసాయ ప్రదర్శన చర్చ గోష్టి, రైతు సదస్సు, వ్యవసాయ ప్రచురణల విడుదల కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి కే.అచ్చం నాయుడు, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు, పశ్చిమగోదావరి జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి దేవి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర,జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కిసాన్ మేళాకు గోదావరి మండలంలోని పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలలోని రైతులు పెద్ద ఎత్తున పాల్గొవాలని ఏడిఆర్ డాక్టర్ పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## తెలుగుదేశం పార్టీ భవనాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



పిఠాపురం మనం న్యూస్: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం పిఠాపురం పట్టణంలో తెలుగుదేశం నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ శనివారం ప్రారంభించారు. వర్మ దంపతులు, కుమారుడు గిరీశ్ వర్మ పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించగా, పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని వర్మ పేర్కొన్నారు. నూతన భవన ప్రారంభంతో నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది.

## ప్రకృతి ప్రసాదించిన ఇసుకను దళారులు



ఆచంట ఫిబ్రవరి 28 మనం న్యూస్: వశిష్ట గోదావరి నుండి ప్రకృతి ప్రసాదించిన ఇసుకను గ్రామీణ ప్రజలకుప్రభుత్వం విక్రయిస్తుందా లేదా దళారులతో విక్రయం జరుగుతుందా అని గ్రామీణ ప్రజలు ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారుఈ సందర్భంగా ఇసుక కొనుగోలుదారులు మాట్లాడుతూ గృహ నిర్మాణం కోసం గత్యంతరం లేక ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఇసుక అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇసుక వినియోగదారులకు సరఫరా చేస్తున్నారా లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు ఇసుక ఎక్కడ ప్రభుత్వం హయాంలో దళారులతో సరఫరా చేసిన సరసమైన ధర తీసుకోవాలని ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు వినియోగదారులు విజ్ఞప్తి చేశారు

## క్షీరపురిలో కళా సాహితీ ప్రియులను అలరించిన భువన విజయం



పాలకొల్లు, మార్చి 28,మనం ప్రతినిధి: శ్రీరామనవమి పర్వదినం, ప్రపంచ నాటక రంగం దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కార భారతి ప.గో.జిల్లాశాఖ ఆధ్వర్యంలోపాలకొల్లు క్షత్రియసంక్షేమపరిషత్, కాస్మో కల్చరల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సంస్థల సౌజన్యంతో నిర్వహించిన' భువన విజయం 'సాహిత్యరూపకప్రదర్శన కడు రసవత్తరంగ, మిక్కిలి ఉత్తేజకరంగ సాగింది. శ్రీరామచంద్రునిపాలనాకాలంనుండి తరతరాలుగా పరిఢవిల్లుతూ వస్తున్న మన భారతీయ సంస్కృతి,హైందవ ధర్మపరిరక్షణ ప్రధానాంశంగా నడచిన ఈ రూపక ప్రదర్శన ఆద్యంతం సదస్యులను చక్కగా ఆకట్టుకొన్నది. సంస్కారభారతి ఆం.ప్ర.రాష్ట్ర అధ్యక్షులుడా.పి.వి.ఎన్.కృష్ణశ్రీకృష్ణదేవరాయలుగా, గురుసహస్రావధాని డా.కడిమిళ్ళ వరప్రసాద్ మహామంత్రి తిమ్మరుసు గా, సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు చేగొండి వి వి సత్యనారా యణమూర్తి రామరాజ భూషణుడు గా,మిగిలిన అష్టదిగ్గజ కవులు వారివారిసమస్యాపూరణలతో, కావ్యగానాలతో శ్రోతలను చక్కగా అలరించారు. తొలుత శ్రీ చక్రా వధానుల రెడ్డప్పధవేజీ కవులను వేదికపైకి స్వాగతించగా సంస్కారభారతి జల్లా కోశాధికారియర్రంశెట్టివేంకటరత్నంపండితసత్కారాలనునిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చేకూరిసూర్యనారాయణ రాజు, కాస్మో కల్చరల్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజు లు పాల్గొన్నారు. బాబుశ్రీ, నెక్కంటిసుబ్బారావు,పొన్నాడ సుబ్రహ్మణ్యం, గుండారామకృష్ణ, పి. తిరుపతి రాజు,గంటా నాయుడు వంగానరసింహారావు,రాయి సూరిబాబు,గంటా నాగరాజు సంస్కారభారతి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.రామ్జీ, రసధుని గౌ. అధ్యక్షులుశ్రీపెద్దిభొట్లలక్ష్మీనారాయణ,కారుమూరిశ్రీరాములు, బి.ఎస్.ఎన్.ఎల్ రాజు,చల్లా అన్నపూర్ణేశ్వరరావు, పోకల వెంకటేశ్వరరావు పెన్షనర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి పి.ఎస్ ప్రతాప్ రాజు, జి ఎస్ ఎన్ మూర్తి, పోలిశెట్టి ,దిరిశాల వెంకటేశ్వర రావు, డా. కొలాటి పెద్దిరాజు మున్నగువారు పాల్గొన్నారు.

# విపత్తుల సమయంలో ప్రణాళికతో కూడిన అప్రమత్తత అత్యంత అవసరం



ముమ్మిడివరం, మార్చి 28, మనం న్యూస్: తుఫానులు, వరదలు వంటి విపత్తుల సమయంలో ప్రణాళికతో కూడిన అప్రమత్తత అత్యంత అవసరమని బీమాభాయి మహిళా మండలి ఉమెన్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వి ఝాన్సీ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని మండల కేంద్రమైన తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అత్యవసర ప్రణాళిక మరియు నిర్వహణ గురించిన విపత్తు నివారణ ప్రణాళికను గూర్చి నిర్వహించిన శిక్షకుల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ విపత్తులు ఏర్పడే సమయానికి ముందు, ఏర్పడే సమయంలో మరియు ఏర్పడిన తరువాత గ్రామాల్లో తీసుకోవాల్సిన పలు చర్యలను గురించి వివరించారు. గ్రామాల వారి విపత్తు నివారణ ప్రణాళిక కచ్చితంగా ఏర్పాటు చేసుకున్నట్లయితే , విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చునని నందివర్ధన అన్నారు.ఈ సందర్భంగా ఏ విధంగా గ్రామ విపత్తు నివారణ ప్రణాళికను సిద్ధం చేయాలి అనే అంశంపై శిక్షణ పొందుతున్న వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన శిక్షణ పొందేవారు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్లైన్ బెట్టింగ్ సూరంపాలెం ఆదిత్య కాలేజ్ విద్యార్థి బలి



గండేపల్లి మార్చి 28( మనం న్యూస్): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఎంబీఏ విద్యార్థి బషీర్ ఉరివేసుకొని ఆత్మహత్య, ఆన్లైన్ యాప్స్ అప్పులు తీర్చలేక తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుని కుటుంబ సభ్యులు, ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగ్ కు అలవాటు పడి అప్పులు తీసుకుని కట్టలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులకు లేఖ రాసిన మృతుడు, మరియు నన్ను క్షమించండి మంచి కొడుకుగా ఉండలేకపోయానని, సూసైడ్ లెటర్ లో రాసిన బషీర్, ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

## పండిట్ దీన్ దయాల్ శిక్షణ తరగతుల కార్యక్రమం



ఏలేశ్వరం,మార్చి 28(మనం న్యూస్): నగర పంచాయతీలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పైలా సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆఫీసులో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు కార్యక్రమం శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమంలో ముందు రోజు సాయంత్రం భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అందరూ పార్టీ ఆఫీసులో కలుసుకొని రాత్రి అక్కడే బస చేసి ఈరోజు ఉదయం తెల్లవారుజామునే లేచి యోగా ఆసనాలు వేసి ఆ తదుపరి అల్పాహారం భుజించిన తర్వాత భారతీయ జనతా పార్టీ జిల్లా నుంచి వచ్చిన పెద్దలతో వివిధ కాలాంశముల గురించి భారతీయ జనతా పార్టీ విశిష్టత గురించి సవివరంగా వివరించడం జరిగింది. తదనంతరం అందరూ భోజనాలు చేసి మరి కొంతసేపు కార్యక్రమం నిర్వహించుకుని ముగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం అర్బన్ మండలాధ్యక్షుడు పైల అయ్యప్ప ఏలేశ్వరం రూరల్ మండల అధ్యక్షుడు నీలి సురేష్ జిల్లా నుంచి వచ్చిన కుండల సాయికుమార్, సింగిలీదేవి సత్తిరాజు, ఉమ్మడి వెంకట్రావు, డి,వీఎస్ రాజు, గంగాధర్, చింతల పాండవులు, కర్రోదు గణేష్, పొన్నాడ సత్తిబాబు,రౌతు వెంకన్న బాబు, సామంతుల భక్తాంజనేయ, పొట్లూరి అప్పారావు,గండేటి వేణు, కూరాకుల రాజా,నీరుకొండ సత్యనారాయణ, తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడే ఆసుపత్రిలోనే ప్రాణాలకు ముప్పు




ప్రత్తిపాడు మార్చి 28 (మనం న్యూస్): ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో బయటపడిన దారుణ నిర్లక్ష్యం ప్రజలను షాక్కు గురి చేసింది. ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రిలోనే రోగుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న స్ట్రెచ్చ రక్తపు మరకలు అలాగే ఉండటం, పక్కనే వాడిన గ్లవ్స్ నిర్లక్ష్యంగా పడివుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అత్యంత ప్రమాదకరమైన బయోమెడికల్ వ్యర్థాలను సక్రమంగా తొలగించాల్సిన చోట, అవే ప్రజల మధ్య ఉంచడం ఆరోగ్య వ్యవస్థ వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇక్కడ చికిత్స కోసం వస్తే వ్యాధులు తగ్గడం కాకుండా మరింత పెరిగే పరిస్థితి ఉంది. ఇలాంటి ఆసుపత్రుల్లో ప్రజలు ఎలా నమ్మకం పెట్టుకోవాలి? అని ప్రశ్నిస్తున్నారు.

## పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్గా ఎన్.వి.శివరామ్ బాధ్యతల స్వీకరణ

పిఠాపురం మనం న్యూస్ : పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డా.ఎన్ వి శివరామ్ ప్రసాద్ శనివారం పిఠాపురం పాడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసారు.



## విద్యార్థులకు జనసేన నాయకుడి సహాయం




యు. కొత్తపల్లి మార్చి 28 (మనం న్యూస్): ములపేట గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహంలో ఉన్న విద్యార్థుల సమస్యలను గుర్తించిన జనసేన నాయకుడు సురక్ష మల్టీస్పెషల్టి హాస్పిటల్ అధినేత జ్యోతుల శ్రీనివాసు శనివారం హాస్టల్లో ఇరవై మంది విద్యార్థులు నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలుసుకున్న ఆయన, వెంటనే తన సొంత నిధులతో పరుపులు, తలగడలు అందజేశారు. విద్యార్థుల ఇబ్బందులను తగ్గించేందుకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని హాస్టల్ సిబ్బంది తెలిపారు. విద్యార్థులు కూడా జ్యోతుల శ్రీనివాసుకు కృతజ్ఞతలు తెలిపారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన చోట సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. జనసేన అధ్యక్షుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా మండలంలో జనసేన నాయకులు పనిచేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో కూడా విద్యార్థులు వసతి గృహంలో చేరితే వారికి కూడా సహకార అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## గ్రామాల పరిశుభ్రతను మెరుగుపరచాలి

యు. కొత్తపల్లి మార్చి 28 (మనం న్యూస్): పిఠాపురం నియోజకవర్గంలో గ్రామాల పరిశుభ్రతను మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు ప్రారంభమయ్యాయిఅని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెడం దొరబాబు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామాల పరిశుభ్రత జయం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కూటమి సహకారంతో చెత్త సేకరణకు నాలుగు ట్రాక్టర్లు, 10 రిక్షాలను ప్రారంభించారున. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం ప్రధాన లక్ష్యంగా చెత్త సేకరణ, నిర్వహణపై చర్యలు చేపట్టడం జరిగిందని గ్రామస్థులు తమ ఇళ్లలోని చెత్తను స్వచ్ఛత రథం వద్దకు తీసుకువస్తే, వారికి ప్రతిగా అవసరమైన నిత్యవసర వస్తువులు అందించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రావు అక్షయ్, గంట విజయ్ కుమార్, ఉమ్మిడి జాను, పల్లెటి బాపన్న దొర, ఎంపీడీవో లక్ష్మీ రెడ్డి పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




## సైనిక్ స్కూల్ కోరుకొండకు ఎంపికై ప్రతిభ చాటిన విద్యార్థులు



ముమ్మిడివరం,మార్చి 28, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలంలోని జి మూలపాలెం మోడల్ ప్రైమరీ స్కూల్ నుండి కాలాడి పవన శ్రీను; సంగాని మౌనన్య ఇద్దరు అలాగే కొమ్మరగిరి కోలావారి మెరక ఖ్ఖి స్కూల్ నుండి తోట అద్విక జవహర్ నవోదయ విద్యాలయానికి మరియు సైనిక స్కూల్ కోరుకొండకు అర్హత సాధించారు ఈ విషయమై జి మూలపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంది పోగుల అనిల్ అరవింద్ కుమార్ , కమిటీ చైర్మన్ సంగాని ఆదినారాయణ , కొలవరి మెరక ప్రధానోపాధ్యాయురాలు ఉందుర్తి కనకదుర్గ, జవహర్ నవోదయ విద్యాలయానికిను మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ 1 నల్లిమిల్లి కొండారెడ్డి ఎంఈఓ 2 వీధి సురేష్ బాబు మరియు గ్రామ పెద్దలు విద్యార్థులను సంబంధిత ప్రధానోపాధ్యాయులను అభినందించారు.

# అన్నదాత సుఖీభవతో రైతులకు ఆర్థిక భరోసా



- ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ

నరసాపురం, మార్చి 28 (మనం న్యూస్): రైతుల అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నరసాపురం ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ అన్నారు. నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో శనివారం తెదేపా మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ మూడో విడత కార్యక్రమంపై డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని రైతులను కలిసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.కూటమి నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, కొప్పినీడి నాగు, పైడికొండల వెంకటకృష్ణ, నడిపూడి పండు, అందే రామకృష్ణ, వడ్డి ముక్తేశ్వర రావు, యర్రంశెట్టి నాగేశ్వరావు, కడిమి శ్రవణ్ కుమార్, వేండ్ర సత్యనారాయణ, పెదపాటి శాంతరాజు, రేవు ప్రభుదాసు, కుడిపూడి వెంకట్రావు, నాగిడి రాంబాబు, దొంగ మురళి, రేవు రాజకుమార్, కర్ణ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అబుధాబిలో క్షిపణి శకలాలు

## భారతీయులకు గాయాలు



**అబిదాబి, మార్చి 28:** గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ క్షిపణి శకలాలు పడి యూఏఈలోని అబుధాబిలో ఐదుగురు భారతీయులు గాయపడ్డారు. ఈ విషయాన్ని అక్కడి అధికారులు ధ్రువీకరించారు. తమవైపు దూసుకొచ్చిన బాలిస్టిక్ క్షిపణిని గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా అడ్డుకున్నట్లు యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. క్షిపణి శకలాలు కెజాద్‌లో రెండుచోట్ల పడటంతో పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు వెల్లడించింది. వాటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న ఐదుగురు భారతీయులు గాయపడ్డారని ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకి పెరుగుతున్నాయి. అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధంలోకి తాజాగా హూతీలు కూడా ఎంట్రీ ఇచ్చినట్లు తెలుస్తోంది. శనివారం యెమెన్ నుంచి ఓ క్షిపణి దూసుకొచ్చిందని ఐడీఎఫ్ పేర్కొంది. ఇరాన్‌కు మద్దతు గల హూతీలు దక్షిణ ఇజ్రాయెల్ పైకి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించగా తమ వైమానిక రక్షణదళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయని వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపింది. అయితే, ఈ దాడి తామే చేశామని హూతీలు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

# నోయిడాలో పర్యటిస్తే ప్రధాని పదవి పోతుందన్నారు

## ప్రధాని నరేంద్ర మోడీ సమాజ్‌వాదీ పార్టీపై విమర్శ



నోయిడా, మార్చి 28: ఉత్తరప్రదేశ్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జెవర్లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విపక్ష సమాజవాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని ఉద్దేశించే మోడీ మాట్లాడారు.''గతంలో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజవాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను.

అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోడీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచింది'' అని మోడీ పేర్కొన్నారు.

అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా-ఢిల్లీని అనుసంధానించే డీఎన్డీ ఫ్లైవేను నోయిడా నుంచి కాకుండా ఢిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం.

ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢ నమ్మకాన్ని పట్టించుకోలేదు.

ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు.



# డీఎంకే-కాంగ్రెస్ సీట్లు ఫిక్స్

- కాంగ్రెస్‌కు 28 సీట్లు
- 164 సీట్లలో డీఎంకే పోటీ

**చెన్నై, మార్చి 28:** తమిళనాడులో అధికార డీఎంకే, కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకాలు ఖరారయ్యాయి. మొత్తం 234 స్థానాల్లో మిత్ర పక్షాలకు 70 సీట్లు ఇచ్చి మిగతా 164 స్థానాల్లో డీఎంకే బరిలోకి దిగుతోంది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్‌కు 28 సీట్లు కేటాయించింది. వాటిలో పొన్నేరి, ఈరోడ్ ఈస్ట్, విలవన్కోడ్, శివకాశి, కారైకుడి మొదలైన స్థానాలు ఉన్నాయి. డీఎండీకేకు 10 సీట్లు, రెండు వామపక్ష పార్టీలకు చెరో 5 స్థానాలు, వీసీకేకు 8, ఎండీఎంకే 4, ఎంఎంకే 2, ఐయూఎంఎల్ 2, ఎంజేకే ఎస్డీపీఐకు చెరొక సీటు కేటాయించింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేయనున్న డీఎంకే అభ్యర్థుల తొలి జాబితాను స్టాలిన్ విడుదల చేశారు. కొలతూర్ నుంచి స్టాలిన్, చెపాక్-ట్రిప్లికేన్ నుంచి డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పోటీ చేయనున్నారు. కొయంబత్తూర్ సౌత్ నుంచి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ బరిలోకి దిగారు. బోడినాయగనూర్ నుంచి పన్నీర్ సెల్వం పోటీలో ఉన్నారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది. కౌంటింగ్ మే 4న ఉంటుంది.

# ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఢిల్లీని స్వాధీనం చేసుకుంటా: మమతా బెనర్జీ



**కోల్‌కతా, మార్చి 28:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్‌లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారాన్ని కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తానన్నారు. బెంగాల్లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఆరోపించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్లుకు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

# యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం

- ప్రధాని నరేంద్ర మోడీ



**నోయిడా, మార్చి 28:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. శనివారం ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో పూర్తయిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోడీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌ను నిర్మించారు.

# మోడీ-ట్రంప్ ఫోన్‌కాల్ మధ్యలో మస్క్

- స్పందించిన విదేశాంగ శాఖ



**ఢిల్లీ/వాషింగ్టన్, మార్చి 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఇటీవల ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. ఈ ఫోన్‌సంభాషణలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కూడా జాయిన్ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ కథనాలపై భారత ప్రభుత్వం తాజాగా స్పందిస్తూ వాటిని తోసిపుచ్చింది. ''ఈ స్టోరీ మా దృష్టికి వచ్చింది. మార్చి 24న మోడీ, ట్రంప్ మాత్రమే ఫోన్లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఇద్దరు నేతలు తమ అభిప్రాయాలు పంచుకోవడానికి అదొక వేదికైంది'' అని విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం గురించి కొన్నిరోజుల క్రితం మోదీ-ట్రంప్ ప్రధానంగా చర్చించారు. ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధి తెరిచి ఉంచాల్సిన ఆవశ్యకత పైనా వారు మాట్లాడుకున్నట్లు భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇలాంటి సున్నితమైన జాతీయ భద్రతా సమస్యలపై ఇద్దరు దేశాధినేతలు చర్చించుకుంటుండగా.. మస్క్ కూడా ఫోన్‌కాల్‌లో జాయిన్ అయినట్లు 'ది న్యూయార్క్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. అయితే ట్రంప్, మోడీ మధ్య జరిగిన సంభాషణ గురించి వైట్ హౌస్, భారత ప్రభుత్వం చేసిన ప్రకటనల్లో మస్క్ ప్రస్తావన ఎక్కడా లేకపోయినా.. ఈ వార్తలు రావడం చర్చనీయాంశమైంది. మరోవైపు, ఫోన్ కాల్‌లో మస్క్ పాల్గొనడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట దాటేశారు. ఇవన్నీ అనుమానాలకు తావిచ్చాయి. ఈ సందేహాల నేపథ్యంలోనే భారత ప్రభుత్వం దీనిపై స్పష్టతనిచ్చింది.

# భూతల దాడులు చేయకుండానే మా లక్ష్యాలు సాధిస్తాం

- అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో




**వాషింగ్టన్, మార్చి 28:** ఇరాన్‌పై యుద్ధం విషయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. అనుకున్న దానికంటే ముందుగానే.. మరికొన్ని వారాల్లో ఆ దేశంపై దాడులు ముగిస్తామన్నారు. టెహ్రాన్‌పై భూతల దాడులు చేయకుండానే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ధీమా వ్యక్తంచేశారు. రాబోయే రెండు వారాల్లో తమ దాడులు పూర్తయ్యేసరికి టెహ్రాన్ చరిత్రలో ఎన్నడూ లేనంత బలహీనంగా మారిపోతుందన్నారు. ఫ్రాన్స్‌లో జీ7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం రూబియో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే తమ తక్షణ కర్తవ్యమని రూబియో అన్నారు. ఈ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాలకవర్గం తమకు పలు సందేశాలు పంపిందని అయితే తాము ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం స్పందించలేదని తెలిపారు. పశ్చిమాసియాలో యూఎస్ బలగాల మోహరింపుపై రూబియో మాట్లాడుతూ ఇరాన్‌పై భూతల దాడులు చేయాలని తాము అనుకోవట్లేదన్నారు. కానీ అత్యవసర పరిస్థితులు తలెత్తితే వాటిని ఎదుర్కోవడానికి వీలుగా ట్రంప్ తమ దళాలను ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నారని తెలిపారు.

# ఎప్‌స్టీన్‌కు సాయం కేసు..

## రూ.687 కోట్లు ఇచ్చేందుకు

## బ్యాంక్ ఆఫ్ అమెరికా అంగీకారం




**వాషింగ్టన్, మార్చి 28:** లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సాయం అందించారని ఆరోపిస్తూ ఓ మహిళ వేసిన దావాను సెటిల్మెంట్ చేసుకునేందుకు బ్యాంక్ ఆఫ్ అమెరికా అంగీకరించింది. అందులో భాగంగా ఆ మహిళకు రూ.687 కోట్లు ఇస్తామని పేర్కొంది. ఎప్‌స్టీన్ బాధితుల తరపున అక్టోబరులో ఓ మహిళ యూఎస్‌లో రెండో అతిపెద్దదైన బ్యాంక్ ఆఫ్ అమెరికాపై దావా వేశారు. ఎప్‌స్టీన్ నేరాలకు సంబంధించి సమాచారం ఉన్నప్పటికీ.. బాధితులను రక్షించడం కంటే బ్యాంకు లాభాలకే ప్రాధాన్యం ఇచ్చిందని ఆమె ఆరోపించారు. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను కూడా అది పట్టించుకోలేదని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను బ్యాంకు ఖండించింది. అప్పట్లో తమ బ్యాంకు సాధారణ సేవలు అందించిన వ్యక్తులకు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్న విషయం తమకు తెలియదని పేర్కొంది. యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జెడ్ రకాఫ్ జనవరిలో ఈ దావాపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్దేశపూర్వకంగానే ఎప్‌స్టీన్‌కు సాయం అందించిందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో దావాను రూ.687 కోట్లకు సెటిల్మెంట్ చేసుకోవాలని బ్యాంక్ నిర్ణయించుకుంది. బ్యాంకు, మహిళ తరపు న్యాయవాదులు ఈ విషయాన్ని న్యాయమూర్తి రకాఫ్ వద్ద స్పష్టం చేశారు. అయితే, ఎప్‌స్టీన్ లైంగిక అక్రమ రవాణా నేరాలకు సహకారం అందించలేదనే దానికి కట్టుబడి ఉన్నట్లు బ్యాంకు ప్రతినిధులు పేర్కొన్నారు. దావాను సెటిల్మెంట్ చేసుకుని దీన్ని ఇక్కడితో ముగించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఇది తమ క్లయింట్లకు ఆర్థిక ఉపశమనం ఇస్తుందని ఎప్‌స్టీన్ బాధితుల తరపు న్యాయవాదులు కోర్టులో వెల్లడించారు. ఈ సెటిల్మెంట్‌ను న్యాయమూర్తి అంగీకరించాల్సి ఉంది. వచ్చే గురువారం న్యాయమూర్తి దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

# 'ట్రంప్ జలసంధి'.. అదే హర్మూజ్

- ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు



**వాషింగ్టన్, మార్చి 28:** పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్‌ను 'ట్రంప్ జలసంధి' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు మియామిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ''ప్రస్తుతం మేం చర్చలు జరుపుతున్నాం. వాటినుంచి ఏదైనా సానుకూల ఫలితం వస్తే బాగుంటుంది. కానీ వాళ్లు ట్రంప్ జలసంధిని తెరవాలి. అదే అదే హర్మూజ్. అయ్యో.. నేను పెద్ద పొరపాటు చేశా. నన్ను క్షమించండి'' అంటూ ట్రంప్ వ్యంగ్యంగా మాట్లాడారు. మళ్లీ వెంటనే.. ''ఆయన పొరపాటున ట్రంప్ జలసంధి అన్నారని నకిలీ వార్తలు రాస్తుంటారు. నా దగ్గర అలాంటి పొరపాట్లేం ఉండవు'' అని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో అమెరికా సైన్యం తన లక్ష్యాలను సాధిస్తోందన్నారు. ''47 ఏళ్లుగా పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ బెదిరింపులకు పాల్పడుతోంది. ఇకనుంచి అలాంటివి జరగవు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీతో ఇరాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బతీశాం'' అని అన్నారు.

ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాలు అమెరికాతో కలిసి రావడం లేదు. అది ట్రంప్‌నకు తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. దాంతో మరోసారి ఆ దేశాలపై బెదిరింపులకు దిగారు. ''వారు మనకు అండగా లేనప్పుడు వారికి మనం ఎందుకు మద్దతు ఇవ్వాలి. నాటోపై ఏటా వందల బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు వారి ప్రవర్తన చూస్తుంటే.. మనం వారితో ఉండాల్సిన అవసరం లేదనుకుంటా..?'' అని బెదిరించారు.

# క్లాస్‌రూమ్‌లో విద్యార్థిపై విద్వేష వ్యాఖ్యలు

## నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు: ప్రొఫెసర్ సస్పెన్షన్



**బెంగళూరు, మార్చి 28:** విద్యార్థిపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినందుకుగాను ఓ ప్రొఫెసర్ను సస్పెండ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన బెంగళూరులోని పీఈఎస్ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తరగతి గదిలో పాఠాలు చెబుతున్న సమయంలో అఫాన్ అనే విద్యార్థి బయటకు వెళ్లడానికి ప్రొఫెసర్‌ను అనుమతి అడిగాడు. అందుకు నిరాకరించిన ప్రొఫెసర్ ఆగ్రహంతో ఊగిపోతూ విద్యార్థిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సదరు విద్యార్థిని ఉగ్రవాది అని పిలుస్తూ.. ఇరాన్ యుద్ధానికి నీలాంటివారే కారణమంటూ విమర్శించారు. ట్రంప్ వచ్చి నిన్ను తీసుకెళ్లిపోతాడంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనను ఓ విద్యార్థి వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్గా మారింది. దీనిపై కాంగ్రెస్ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యార్థి మతాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై తీవ్ర వ్యతిరేకత రావడంతో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఈ విషయంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపింది.

# బెంగాల్ టీఎంసీ ప్రభుత్వంపై అమిత్ షా 'ఛార్జిషీట్'



**ఢిల్లీ, మార్చి 28:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. టీఎంసీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కేంద్రమంత్రి అమిత్ షా 'ఛార్జిషీట్' విడుదల చేశారు. 15 ఏళ్ల టీఎంసీ దుష్పరిపాలన, బెంగాల్‌ను ఆ పార్టీ అవినీతిమయంగా ఎలా మార్చిందనే విషయాలను ఆ ఛార్జ్ షీట్లో పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా బెంగాల్లో అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు నడుస్తున్నాయని..శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల సిలిగుడి కారిడార్ భద్రతకు ముప్పు వాటిల్లిందని ఆరోపించారు.

గతంలో అస్సాంలోనూ చొరబాటుదారులు ప్రవేశించేవారని బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ చొరబాట్లు ఆగిపోయాయని అమిత్ షా అన్నారు. ప్రస్తుతం కేవలం బెంగాల్ నుంచే భారత్‌లోకి చొరబాటుదారులు ప్రవేశిస్తున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు ఇది ఆందోళనకరంగా మారిందన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత కూడా బార్డర్ ఫెన్సింగ్ కోసం బీఎస్ఎఫ్‌కు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించట్లేదని మంత్రి అమిత్‌షా ఆరోపించారు.

రాష్ట్ర పోలీసులు, అధికారులు అక్రమ వలసలను అడ్డుకోకపోవడం వల్ల వారు నకిలీ పత్రాలతో బెంగాల్ ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకి వస్తున్నారన్నారు. వారిని అడ్డుకోవడానికి బదులుగా చొరబాటుదారుల ఓట్లు పోతాయనే భయంతో మమత 'సర్' ప్రక్రియపై, ఎన్నికల కమిష్న నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

బెంగాల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చొరబాట్లను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని..సరిహద్దు కంచె వేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు హామీ ఇచ్చారు.

# మొజ్తాబా ఖమేనీ కూడా చనిపోయే ఉంటాడు

## అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 28:** ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ నాయకత్వం మొత్తాన్ని తుడిచిపెట్టామని, మొజ్తాబా చనిపోయే ఉంటారంటూ మియామిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ''ఇరాన్ అత్యున్నత నాయకత్వం, మిలిటరీ శక్తి ధ్వంసమైంది. వారి నాయకులు చనిపోయారు. వారికి ఇప్పుడు సుప్రీం లీడరే లేరు. ఆయన చనిపోయారు. ఆయన నుంచి ఎలాంటి ప్రకటనలు రావట్లేదు కాబట్టి.. ఆయన చనిపోయి ఉండాలి, లేకపోతే ఆయన పరిస్థితి విషమంగానైనా ఉండాలి'' అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తాబా పేరిట ఎలాంటి ప్రకటనలు రావడం లేదు. అలాగే ఆయన ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపైనా పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## సంఘంలో తీసుకున్న రుణం సకాలంలో చెల్లించాలి



**చిలుకూరు, మార్చి 28 (మనం న్యూస్):** సహాకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రాయితీలు పొందాలని జిల్లా సహాకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహేత్ రాంబాయి సూచించారు. శనివారం మండల పరిధిలోని బేతవోలు గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు, రైతులు సహాకార సంఘంలో దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను తీసుకొంటు సమయం ప్రకారం -చెల్లించి సంఘం అబివృద్ధికి సహాకరించాలని అన్నారు. సహాకార సంఘాలలో రైతులు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. అనంతరం సంఘం వార్షిక నివేధికను చదివి వినిపించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈవో పాషా, సర్పంచ్లు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి ప్రమాదాలలో రక్షణ పొందండి

- కోదాడ డివిజనల్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి




**కోదాడ, మార్చి 28(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలో పట్టణ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగినది. కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని కోదాడ సబ్ డివిజనల్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ తో కలిసి ప్రారంభించారు. ర్యాలీ ఖమ్మం క్రాస్ రోడ్డు నుండి రంగా థియేటర్ క్రాస్ రోడ్డు వరకు నిర్వహించి స్థానిక ప్రజలకు, వాహనదారులకు, స్థానిక వ్యాపారులకు హెల్మెట్ వినియోగం పట్ల అవగాహన కల్పించారు. ర్యాలీ నందు పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. ద్విచక్ర వాహనంపై కూర్చునే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగం అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు. ప్రతి పౌరుడు, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాల పట్ల, సురక్షిత ప్రయాణం పట్ల, రహదారుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రజలకు రోడ్డు నియమాల పట్ల, జాగ్రత్తల పట్ల విస్తృతంగా అవగాహన కల్పిస్తుందని ప్రజలు వాహన దారులు గమనించాలని కోరారు. వాహనదారులు వాహనాలు నిదానంగా నడపాలని అన్నారు. ఈ ర్యాలీ నందు పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, పట్టణ ఎస్ఐ సుధీర్, పోలీసు సిబ్బంది స్థానిక పౌరులు పెద్దలు పాల్గొన్నారు.

## పాఠశాలలో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలి

- విద్యుత్ వైర్ ను కట్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ మండల నాయకులు అర్రురి యలమంచి



**పెన్ పహాడ్, మార్చి 28 (మనం న్యూస్):** మండలంలోని ధర్మాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక వార్డు సభ్యులు అర్రురి యలమంచి స్థానిక ప్రజా ప్రతినిధులను కోరారు ఈ సందర్భంగా శనివారం ఆయన పాఠశాల ఆవరణాన్ని పరిశీలించి మాట్లాడారు గత రెండు నెల క్రితం పాఠశాలలో ఒక తరగతి గది నుండి మరో తరగతి గదిలోకి ఏర్పాటు చేసిన విద్యుత్తు వైర్ ను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి పాఠశాలలో విద్యుత్తు లేకుండా చేశారని వారిని గుర్తించి ఈ సంఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని దీనితోపాటు పాఠశాల బాత్రూంలో, ఆవరణంలో మద్యం సేవిస్తూ విచ్చలవిడిగా మద్యం బాటిల్ ని పడవేస్తూ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులను అసౌకర్యానికి గురి చేస్తున్నారని ఈ విషయం తన దృష్టికి వచ్చి ఫిబ్రవరి నెలలో ఏర్పాటు చేసిన మొదటి గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ల సమావేశంలోనే సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యుల దృష్టికి సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలని తీసుకురావడం జరిగిందని అన్నారు ఇప్పటికైనా పాఠశాల అభివృద్ధి కోసం ఇలాంటి సంఘటనలు జరగకుండా వెంటనే సీసీ కెమెరా ఏర్పాటు చేయించడం కోసం కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామినేని శ్రీనివాస్, వార్డు సభ్యులు మాతంగి బేబీ సందీప్, నాయకులు పందిరి సైదిరెడ్డి, సంగిరెడ్డి నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లయిన హామీల నెరవేర్చలేదు



**సూర్యాపేట టౌన్, మార్చి 28, మనం న్యూస్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రెండేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ విమర్శించారు. శనివారం పట్టణంలోని ముత్యాలమ్మ గుడి నందు నిర్వహించిన ఆ పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు 2500, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, భూమిలేని పేద వ్యవసాయ కూలీలకు 12000, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్ల పెంపు వంటి హామీని అటకెక్కించారని ఆరోపించారు. సూర్యాపేట పట్టణంలో అనేకమంది సొంత ఇంటి స్థలము లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ఇంటి స్థలం లేని వారందరికీ 200 గజాలు ఇంటి స్థలం మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలన్నారు. సూర్యాపేట పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. శివారు ప్రాంతాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. విలీన గ్రామాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న సూర్యాపేట కలెక్టరేట్ ముందు వేలాదిమంది పేదలతో ఆందోళన చేస్తున్నామన్నారు. ఆ పార్టీ టౌన్ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ సైదులు, గంగపురి శశిరేఖ, నగిరి జయమ్మ, పిట్టల రాణి, షేక్ జహంగీర్, వట్టె ఎర్రయ్య పాల్గొన్నారు.

## హజ్ యాత్రకు వెళ్లే మైనార్టీలకు వైద్య పరీక్షలు



**సూర్యాపేట, మార్చి 28 (మనం ప్రతినిధి):** హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా వైద్య. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పి పి యూనిట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూర్యాపేట నందు శనివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన కౌంటర్ల ద్వారా టీకా కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా పెండెం వెంకట రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యాత్రికులు విదేశీ ప్రయాణం చేసే సందర్భంలో వాతావరణ మార్పులు, జనసమ్మర్థం, భిన్నమైన ఆహారపు అలవాట్ల వలన వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ముందస్తు జాగ్రత్తగా హజ్ యాత్రకు వెళ్ళే ప్రతి యాత్రికుడు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన టీకాలను తీసుకోవాలని తెలిపారు. మెనింజిటిస్ టీకాఇన్ఫ్లుయెంజా, పోలియో టీకాలు 40 మండి యాత్రికులకు ఇవ్వటం జరిగింది. ఈ యాత్ర సమయంలో వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చని వివరించారు. అలాగే, యాత్రికులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తాగునీరు మరియు ఆహారంపై జాగ్రత్తలు తీసుకోవడం, మాస్క్ వినియోగం వంటి ఆరోగ్య నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. టీకా అనంతరం అనుసరించాల్సిన జాగ్రత్తలపై కూడా వారికి అవగాహన కల్పించారు.

హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆరోగ్యంగా యాత్ర పూర్తి చేసుకుని సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. హజ్ కమిటీ సబ్యులు శ్రీ సిద్దిక్, ఇమ్రాన్ పాల్గొని టీకాలు నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా కోటి రత్నం, డా వాసవి, డా సనత్, విసిసియం లతీఫ్, డి వి యల్ యం నవకాంత్, ఆరోగ్య సిబ్బంది జానీబేగం, వజీర్ భాను, నసీమా, నేహా తదితరులు టీకాలు వేశారు.

### తిరుమలగిరి పురపాలక సంఘం
## బడ్జెట్కు ఏకగ్రీవ ఆమోదం



- అంచనా రూ.కోట్ల 29.20 లక్షలు
- ఖర్చు కూడా రూ. కోట్ల 29.20 లక్షలు

**తిరుమలగిరి, మార్చి28 (మనం న్యూస్):** తిరుమలగిరి పురపాలక సంఘం బడ్జెట్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్పర్సన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డిఅధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం నుండి వచ్చే వివిధ గ్రాంట్లు, మున్సిపల్ ఆదాయం కలుపుకొని మొత్తం రూ.29 కోట్ల 20 లక్షల ల ఆదాయంగా అంచనా వేశారు. అంచనా ఖర్చులు రూ. కోట్ల 29.20 లక్షలు గా నిర్ణయిస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్కు పాలకవర్గం ఏకగ్రీవంగా పరిపాలన ఆమోదం తెలిపింది. పట్టణ అభివృద్ధి, ప్రజల అవసరాలే లక్ష్యంగా ఈ బడ్జెట్ను రూపొందించినట్లు చైర్పర్సన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశము లో మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు, తసీల్దార్ హరిప్రసాద్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



**కోదాడ, మార్చి 28(మనం న్యూస్):** స్థానిక కెఆర్ఆర్ .ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోదాడలో ఎకోక్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్గానిక్ ఫుడ్ పెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.హదాసరాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ మానవులంతా ప్రకృతికి దగ్గరగా జీవించాలని ప్రతిఒక్కరు మొక్కలు పెంచాలని, నీటిని వృథా చెయ్యొద్దని బావితరాలకు కాలుష్యం లేని సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిమీద ఉందని ప్రసంగించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆర్మీ ఫోర్స్ అధికారి శ్రీరామ్, ఉస్మానియా యూనివర్సిటీ నుండి పీహెచ్డీ పరిశోధకుడు గోపాల్, ప్రముఖ సాహితీ వేత్త కృష్ణమూర్తి పాల్గొన్నారు.కళాశాల విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పర్యావరణ రహిత వస్తువులను, ఆహార పదార్థాలను ప్రదర్శించారు. గాలిని నీటిని నిప్పును అడవులను రక్షించాలని విద్యార్థులు వివిధ పర్యావరణ రహిత ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎకోక్లబ్ కన్వీనర్ మాట్లాడుతూ ప్రకృతి ఇచ్చిన ఆహారాన్ని మనిషి ఆధునికత పేరుతో ధ్వంసం చేస్తున్నాడని కాపాడుకోవలసిన భాధ్యత మనందరిమీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజానాట్య మండలి మహాసభ జయప్రదం చేయాలి



**సూర్యాపేట, మార్చి 28 (మనం ప్రతినిధి):** ఏప్రిల్ 15 నుండి 17 వరకు హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగే ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకన్న పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ నిర్వహించిన ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూప్రజానాట్యమండలి ఎన్నో పోరాటాలు చేయడం ద్వారా ప్రభుత్వం కళాకారుల గుర్తింపు కార్డును ఇచ్చుటకు ప్రభుత్వం అంగీకరించినదని, దీనితో పాటు గుర్తింపు పొందిన కళాకారులకు నెలకు 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలలో 10 శాతం కళాకారులకు గ్రామీణ ప్రాంతాలలో కల్పించాలని ఏప్రిల్15 న హైదరాబాదులో జరిగే కళాకారుల ర్యాలీలో జానపద,వృత్తి కళాకారులు, కోలాట కళాకారులు చెక్కభజన కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కోరారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలోజిల్లా ఉపాధ్యక్షులు బూర్గుల ప్రభాకర్, పిడమర్తి అశోక్, జిల్లా సహాయ కారదర్శిలు నందిపాటి సతీష్,యాతకుల ప్రవీణ్, కందుకూరి శ్రీకాంత్, సంధ్య, జిల్లా కమిటీ సభ్యులు దేవరకొండ వెంకన్న, పోలే పాక శ్రీను,సుజాత, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి దండ్రుల జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన సూర్య రాం

**ములుగు, మార్చి 28 (మనంప్రతినిధి):** మంత్రి సీతక్క ఉద్యమ జీవన సహచరుడు ప్రస్తుత ప్రజా సేవా స్ఫూర్తి ప్రదాత కామ్రేడ్ కుంజ రామన్న 22వ వర్ధంతి సందర్భంగా రచయిత డా. అస్నాల శ్రీనివాస్ వ్రాసిన అడవి దివిటీలు అనే పుస్తకాన్ని శనివారం మంత్రి సీతక్క కుమారుడు కుంజ సూర్య రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత డా. ఆస్నాలా శ్రీనివాస్ మాట్లాడుతూ నేను వ్రాసిన పుస్తకం అడవి దివిటీలు అమరుడు కుంజ రాము సీతక్క జీవన సహచరుడు భారత సామాజిక చలనశీల ఉద్యమాల గతి శీలత ను గొప్ప ముందడుగు వేయించిన వారు. ఆదివాసీ హక్కుల కోసం అలాగే శ్రామిక కులాల అస్తిత్వ ఆత్మ గౌరవ ఉద్యమాల రూపకర్త కుంజ రాము మన కాలపు కొమురం భీమ్ అయినటువంటి వీరిరువురి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించినందుకుగాను సంతోషం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన కుంజ సూర్య మాట్లాడుతూ అమ్మా, నాన్నల స్ఫూర్తితో సమకాలిన రాజకీయాలకు అనుగుణంగా నా ప్రయాణం కొనసాగిస్తానని పుస్తకాన్ని రాసిన రచయిత ఆసనాల శ్రీనివాస్ కు ధన్యవాదములు తెలిపారు.

## ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొవాలి



- జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్

**నల్లగొండ --మార్చ్ 28( మనం ప్రతినిధి ):** ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధుల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్దులు, దివ్యాంగులు సోమవారం నిర్వహించే ప్రజావాణి లో ఇబ్బంది పడవద్దని వారికై ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఇట్టి అవకాశన్ని జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం దివ్యాంగులు, వృద్దుల కొరకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం లో మొత్తం 74 దరఖాస్తులు వచ్చాయి.ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత, అధికారులు, సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

## మే 1న మల్లికార్జున మహోత్సవాలు



**భీమదేవరపల్లి, మార్చి 28 మనం న్యూస్:** మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్ లో మల్లికార్జున ఆలయ మహోత్సవం ముల్కనూర్ యాదవ సంఘం కమిటీ నిర్ణయించింది. శనివారం రోజున ముల్కనూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంఘ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తో బలిజ మేడమా గొల్ల కేతమ్మ దేవతల విగ్రహాలు శివలింగం గణపతి సుబ్రహ్మణ్య స్వామి శ్రీ రాధాకృష్ణ స్వామి అభయ ఆంజనేయ స్వామి విగ్రహాలు తో పాటు ధ్వజస్తంభం నవగ్రహాల ప్రతిష్ట మహోత్సవం మే 1 ప్రారంభమై మే 3న మల్లికార్జున మహోత్సవాలు పూర్తవుతాయని యాదవ సంఘం నాయకులు, అర్చకులు ఖరారు చేశారు. మహోత్సవాలకు గ్రామస్తులు గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని యాదవ సంఘం నాయకులు కోరారు.

## చిన్న ఆలోచన.. పెద్ద ఫలితం

- 'పోలీస్ అక్క'కు స్కోచ్ అవార్డు
- ఢిల్లీలో అవార్డు అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల
- నిర్మల్ జిల్లా ఎస్పీ, సిబ్బందికి డీజీపీ ప్రశంసలు




**హైదరాబాద్,మార్చి 28(మనం,ప్రత్యేక ప్రతినిధి):** నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, పోలీస్ సిబ్బంది చిన్న ఆలోచనతో చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమానికి అరుదైన అవార్డు దక్కింది. విద్యార్థునులకు, మహిళలకు అండగా నిలిచే ఈ కార్యక్రమానికి 'స్కోచ్' అవార్డు లభించింది. దీంతో నిర్మల్ జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. ఈక్రమంలో 'పోలీస్ అక్క' కార్యక్రమానికి స్కోచ్ అవార్డు దక్కడం పట్ల డీజీపీ బి శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కరుణతో కూడిన పోలీసింగ్కు 'పోలీస్ అక్క' ఒక నిలువుటద్దమని, మహిళలకు రక్షణ కల్పించడమే కాకుండా, విద్యార్థినులలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ ఈ కార్యక్రమం అనతికాలంలో అందరి మన్ననలు పొందిందన్నారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల నేతృత్వంలో మహిళా పోలీస్ సిబ్బంది విద్యార్థినులకు అక్కల్లా అండగా నిలుస్తున్నారని డీజీపీ వివరించారు. రాష్ట్రంలోని మహిళా పోలీసులు సమాజంలో రోల్ మోడల్స్గా నిలుస్తూ సామాజిక మార్పునకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సురక్షితమైన, పటిష్టమైన సమాజ నిర్మాణానికి ఇదొక గొప్ప ముందడుగని డీజీపీ తెలిపారు.

**దేశ వ్యాప్తంగా ప్రశంసలు ::**

రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్మల్ జిల్లాలో ప్రారంభమైన పోలీసు అక్క కార్యక్రమం అనతికాలంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం విశేషమని డీజీపీ వివరించారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఈ పురస్కారాన్ని అందుకుని అభినందనీయన్నారు. కేవలం చట్టాన్ని అమలు చేసే యంత్రాంగంగానే కాకుండా, సమాజంలో బాధ్యతాయుతమైన మార్పుకు నాంది పలికేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు.నేటి సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వేధింపులు, గృహహింస, సైబర్ నేరాల వంటి సమస్యల పరిష్కారానికి 'పోలీస్ అక్క' ఒక భరోసాగా నిలుస్తోందన్నారు. పోలీసులను సంప్రదించడానికి సంకోచించే విద్యార్థినులకు ఒక కుటుంబ సభ్యురాలిలా, అక్కలా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని డీజీపీ తెలిపారు. మహిళా పోలీసు అధికారులు కేజీబీవీ పాఠశాలల్లో రాత్రిపూట బస చేస్తూ విద్యార్థినుల సమస్యలను వింటున్నారని, వారికి గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుండటం అద్భుతమని డీజీపీ వారి సేవలను కొనియాడారు.

**7 వేల మందికి ::**

పోలీసు అక్కా కార్యాక్రమం ద్వారా ఇప్పటివరకు సుమారు 7,000 మందికి పైగా విద్యార్థినులు, మహిళలు నేరుగా ప్రయోజనం పొందారని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల తెలిపారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, డయల్ 100 కాల్స్పై తక్షణమే స్పందిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందిస్తున్నామన్నారు. ఒక చిన్న ఆలోచనగా మొదలైన ఈ కార్యక్రమం నేడు జాతీయ స్థాయి గౌరవాన్ని సొంతం చేసుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయం జిల్లాలోని ప్రతి మహిళా పోలీస్ సిబ్బంది కృషి, నిబద్ధతకు దక్కిన ప్రతిఫలమన్నారు. విద్యార్థినులు భయం వీడి తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోగలగడమే ఈ కార్యక్రమం సాధించిన అసలైన విజయమని తేల్చిచెప్పారు. పోలీసు అక్కకు స్కాచ్ అవార్డు రావడం తమపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి బాలికకు భద్రత, ధైర్యం కల్పించడమే తమ లక్ష్యమని, నిర్మల్ జిల్లా పోలీసులు సాధించిన ఈ గౌరవం రాష్ట్ర పోలీస్ శాఖ మరింత వన్నె తెచ్చిందని ఎస్పీ జానకీ షర్మిల వివరించారు.

## ఉప్పాడిలో ఘనంగా సీతారాముల కళ్యాణం




కాత్రేనికోన, మార్చి 28 మనం ప్రతినిధిః ఉప్పాడి లోని కోదండ రామాలయం నందు సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గణేష్ శర్మ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తుల పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు కార్యక్రమంలో ఉచ్చిల రవికుమార్ గణేష్ శర్మ పెయ్యల ఈశ్వరరావు ఉచ్చిల ప్రశాంత్ కొల్లు ఆనంద్ కుమార్ కొంకి గోవిందు పెయ్యల శీను బడుగు మీరా బడుగు మురళి జొన్నాడ పెద బాలయ్య జొన్నాడ బ్రహ్మం, జొన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవాలకు వైభవంగా ఏర్పాట్లు

### ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం సూర్య రమణి

శంఖవరం మార్చి 28 మనం ప్రతినిధిః మండలంలోని బెండపూడి శివారు తిరుపతి అగ్రహారం గ్రామంలో వెలసిన ప్రాచీన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక కళ్యాణ మహోత్సవాల కోసం విశేషంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పుణ్యక్షేత్రం ఇప్పటికే భక్తులతో కళకళలాడుతోందని ఆలయ కార్యనిర్వాహక అధికారిణి ఎం. సూర్య రమణి తెలిపిన వివరాల ప్రకారం, ఉత్సవాలు భక్తి, శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మహోత్సవాల ప్రారంభంగా శనివారం నెల్లిపూడి గ్రామంలో తిరువీధి సేవ ఘనంగా నిర్వహించబడింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి



ఊరేగింపు జరగగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులు ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది.జ బెండపూడి శ్రీ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవాలు భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరగనున్నాయని అధికారులు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృప పొందాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య అర్చకులు పీతాంబరం,అమ్మాజీ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా ముదునూరి మురళీకృష్ణం రాజు



ప్రత్తిపాడు, మార్చి, 28(మనం న్యూస్ ): సమాజంలో బాధపడుతున్న వారిని ఆదుకోవడం నిజమైన సేవగా భావిస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలో ఇటీవల కాలంలో కాలు, చేతి సమస్యలతో తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతున్న బుదిరెడ్డి గోవింద్ , బుర్రె నూకలమ్మ పరిస్థితిని తెలుసుకున్న ఆయన వెంటనే వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పి మానసికంగా బలాన్ని నూరిపోశారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సహాయం ద్వారా చికిత్స ఖర్చులకు కొంత ఉపశమనం లభిస్తుందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపిటిసి సేంద్రిపు భాస్కర్ రావు, గోనగల అజయ్, వార్డ్ సభ్యుడు తాళ్లపూడి బుజ్జి, మురా గంగబాబు, బొల్లు నాగేశ్వరావు, కోలా తాతబాబు, దాడి పుత్తయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి ఆవిర్భావ దినోత్సవానికి భారీగా విస్తృత ఏర్పాట్లు



శంఖవరం మార్చి 28 మనం ప్రతినిధిః టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవానికి శంఖవరం లో భారీగా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందని టిడిపి సీనియర్ నాయకులు పర్వత సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపకుడు నందమూరి తారక రామారావు పేదల సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా పార్టీని స్థాపించారని పేర్కొన్నారు. తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని సంపాదించి అధికారంలోకి వచ్చిన ఘనత టిడిపిదేనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళ సాధికారత, యువత ఉపాధి, రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

## సర్వసభ్య సమావేశంలో సర్పంచులను సత్కరించిన ఎంపీపీ

కిర్లంపూడి, మార్చి 28:( మనం న్యూస్ ): కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట రవి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, ఏప్రిల్ నెలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం పదవీకాలం పూర్తి చేసుకున్న మండలంలోని సర్పంచులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మండల అభివృద్ధి అధికారి హరికృష్ణ, ఎంపీపీ తోట రవి ఆధ్వర్యంలో వారికి జ్ఞాపికలు



అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరం రెడ్డి కాశిబాబు, తోట గాంధీ, చదరం చంటిబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, గోడేబాల, అల్లు శివరామకృష్ణ, గోకాడ రాజా, బొజ్జపు శ్రీను తదితరులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రామచంద్రపురంలో భారీ జాబ్ మేళా

అమలాపురం మార్చి 28మనం న్యూస్ : డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఎంప్లాయిమెంట్ మరియు 'వికాస' సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన రామచంద్రపురం నియోజకవర్గంలో భారీ జాబ్ మేళా నిర్వహించను న్నారు. వేదిక: శ్రీనివాస శైల ఐటిఐ రామచంద్రపురం. అవకాశాలు: సుమారు 10 ప్రముఖ కంపెనీలలో 380కి పైగా ఉద్యోగ ఖాళీలు ఉ న్నాయి.సమయం: ఉదయం నుండి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి. హరిశేషు మాట్లాడు తూ.జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ సువర్ణావకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థు లు తమ విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చునన్నారు.

## ఘర్షణ బాధితులకు ఎమ్మెల్యే అంజిబాబు పరామర్శ

భీమవరం, మార్చి 28 (మనం న్యూస్): పశ్చిమగోదావరి జిల్లా అంటేనే శాంతి, సామరస్యాలకు ప్రతీక అని అటువంటి జిల్లాలో ఘర్షణలు, దాడులు జరగడం దారుణమని ఈ ఘర్షణలను ఖండిస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆకివీడు పెదపేటలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం జరిగిన ఘర్షణలో గాయపడిన బాధితులను భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు శనివారం పరామర్శించారు. భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గవర అనిల్ కుమార్, వెజ్జు నాగ సాయిలను పరామర్శించి ఘర్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడి వారి శరీరంలో చిక్కుకున్న మేకులను



పరిశీలించారు.కార్యక్రమంలో గవర లక్ష్మీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరావు, జనసేన నాయకులు యిర్రింకి సూర్యారావు, వబిలిశెట్టి రామకృష్ణ, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, చల్లా రాము, కొప్పినీడి బాబీ, తేజ, కార్తీక్, యాసా అనిల్, తోట వాసు కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## శ్రీరాముని పల్లకి ఊరేగింపులో జనసేన నేత తలపంటి బుజ్జి



శంఖవరం మార్చి 28 మనం ప్రతినిధిః శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల లోని నెల్లిపూడి గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా,భక్తి పరవశంతో నిర్వహించగా, కోలాటాలతో శ్రీరాముని పల్లకి ఊరేగింపు తో గ్రామం మొత్తం శ్రీరామ నామస్మరణతో మారు మోగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి జనసేన పార్టీ శంఖవరం మండలం ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి ముఖ్య అతిథిగా విచ్చేసి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి పల్లకి ఊరేగింపులో భాగస్వాములు అయ్యారు.

## శ్రీరాముని వేషదారణలో ఆధ్యాత్మికతను చాటిన బాలుడు



ఏలేశ్వరం,మార్చి28(మనం న్యూస్ ): ఏలేశ్వరం పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముని వేషధారణలో ఆధ్యాత్మికతను చాటి చెప్పే విధంగా సవిర్ల వెంకటేష్ దంపతుల కుమారుడు హిందుత్వాన్ని చాటి చెప్పాడు. ఈ మేరకు డొక్కా సీతమ్మ సేవా సమితి శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముని పాదయాత్రలో ప్రత్యేకంగా ఆకర్షించింది.

## భక్తి మరియు బాధ్యతతోనే పర్యావరణ సంరక్షణ



శంఖవరం, మార్చి 28 మనం ప్రతినిధిః భక్తి,బాధ్యత కలిసినప్పుడే పర్యావరణ సంరక్షణ సాధ్యమవుతుందని కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామ చంద్రరావు తెలిపారు. కాకినాడ జిల్లాలోని శంఖవరం మండలం వెలంగి గ్రామంలో సార్లంక రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న మల్లికార్జున లొద్ది శివాలయం వద్ద స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర (సస) కార్యక్రమంలో భాగంగా శుభ్రత కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ రిజర్వ్ ఫారెస్టులలో ఉన్న దేవాలయాలు పర్యావరణపరంగా సున్నితమైనవి మరియు ఆధ్యాత్మికంగా ప్రాముఖ్యత కలిగినవి అని అయితే భక్తులు వదిలివెళ్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఈ సహజ పరిసరాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం రేంజ్ అటవీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, స్వచ్ఛ సేవకులు మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతా రాముల కళ్యాణం

ముమ్మిడివరం మార్చి 28 మనం న్యూస్: ముమ్మిడివరం మండలం లోని చిన కొత్త లంక గ్రామం లో వెలసిన పట్టాభి రామ స్వామి వారి ఆలయంలో సీతా రామ స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా ప్రారంభం అయినది. కార్యక్రమానికి ముమ్మిడివరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జగన్ మోహన్ శివకుమార్ విచ్చేసి కళ్యాణం కు ముఖ్య అతిధులు గా విచ్చేసారు ఈ కళ్యాణ మహోత్సవంలో పొత్తూరి వీరవేంకట సుబ్బరాజు దుర్గ భవానీ,ముదునూరి విశ్వనాథ వర్మ,అమర జ్యోతి మరియు ముదు నూరి రామకృష్ణ వర్మ, సత్యవతి దంపతులు చే సీతా రామ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ప్రారంభవం అయినది. అనంతరం క్రీ.శేషు.పి .సూర్యనారాయణ రాజు, లచ్చయమ్మ, (మనవడు క్రీ.శేషు.ఆకాష్ కుమార్ వర్మ )



జ్ఞాపకార్థం వారి కుమారులు పి .వి .వి .సుబ్బరాజు,పి .టి .వి .వర్మ పేరున అన్నదాన సమారాధన నిర్వహిచారు. కార్యక్రమం లో చిన కొత్త లంక సర్పంచ్ పి ఉమా రాణి, మాజీ సొసైటీ అధ్యక్షులు పి టి వర్మ గ్రామస్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## బెట్టింగ్లకు దూరంగా ఉండండి



కాత్రేనికోన మార్చి 28 మనం ప్రతినిధి : గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రికెట్ బెట్టింగ్, ఆన్లైన్ గేమింగ్లకు దూరంగా ఉండాలని కాత్రేనికోన ఎస్ఐ ఐ అవినాష్ సూచించారు యువత,విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత గేమింగ్ ఫ్లాట్ ఫామ్స్,ఐపీఎల్ బెట్టింగ్లకు పాల్పడొద్దన్నారు. తక్కువ సమయంలో అధికంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో బెట్టింగ్, ఆన్లైన్ గేమింగ్కు యువత బానిసలు అవుతున్నారన్నారు అప్పులు చేసి, ఆర్థికంగా నష్ట పోవడంతో మానసిక ఒత్తిడికి గురై తప్పుడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందన్నారు ఆన్లైన్ బెట్టింగ్ లపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని,ఆధునిక సాంకేతికత సాయంతో ఇలాంటి అక్రమ కార్యక్రమాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటుందని అవినాష్ తెలిపారు, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలు, ప్రవర్తనపై శ్రద్ధ పెట్టాలన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి,బెట్టింగ్లపై పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటెన్సివ్ శిక్షణలో కాత్రేనికోన హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థులు



కాత్రేనికోన మార్చి 28 మనం ప్రతినిధి : సమగ్ర శిక్ష వృత్తివిద్య కోర్సుల్లో భాగంగా జిల్లా అధికారి ఏపీసి మమ్మీ, జి సి డి వో ఓ ఎం ఏ కే భీమారావు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని శ్రీమతి రేఖపల్లి అంబ ఆధ్వర్యంలో పది రోజుల ఇంటెన్సివ్ శిక్షణ కార్యక్రమం లో భాగంగా కాత్రేనికోన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అగ్రికల్చర్,రిటైల్ మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్వేర్ విభాగంలో పది రోజులు ఇంటెన్సివ్ శిక్షణా కార్యక్రమం కొనసాగుతూ ఉన్నది . అందులో భాగంగా ఏపీ ఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ వేర్హౌస్ కార్పొరేషన్ ఎం రాజు, ఐ సతీష్ శిక్షణ ఇస్తున్నారు .శనివారం శిక్షణ కార్యక్రమం ఎలా జరుగుతుందో పరిశీలించటానికి ఒకేషనల్ కోఆర్డినేటర్ రమేష్ విజిట్ చేయడం జరిగిందని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం కే పేరిశెట్టి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమం లో ఎం సుధీర్,పి రవి వర్మ , కె. విజయ్ ఒకేషనల్ ట్రైనర్స్ పాల్గొవటం జరిగింది.

## వేసవిలో ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక చర్యలు

- అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉంది
- చందాపురం ఘటనపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

నందిగామ,మార్చి,28,(మనం న్యూస్): జిల్లా వ్యాప్తంగా వేసవి నేపథ్యంలో ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించామని.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి అప్రమత్తంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం క్షేత్ర పర్యటనల్లో భాగంగా చందాపురం గ్రామాన్ని సందర్శించి.. వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారి పరిస్థితి, తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. ముందు జాగ్రత్తగా ఇంటింటి సర్వేలు నిర్వహిస్తూ అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స



పొందుతున్న వారిని పరామర్శించి భరోసా కల్పించారు. ఎనిమిది కేసులకు సంబంధించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆహారం, నీటి నమూనాలను పరీక్షలకు పంపించినట్లు తెలిపారు. వడదెబ్బ కారణమా అనే కోణంలోనూ పరీక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో శుద్ధమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజలు తప్పనిసరిగా మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలని, ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విరేచనాలు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమాచారమివ్వాలన్నారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్య సూచనలు పాటించాలని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.




# ఆరంభం నిల్.. ముగింపు ఫుల్

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ వేడుకలు నిర్వహించకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది తొక్కిసలాటలో చనిపోయిన 11 మంది అభిమానులకు నివాళిగా నల్ల బ్యాడ్జీలతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలో దిగింది. అయితే ఐపీఎల్ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు బీసీసీఐ సెక్రటరీ ప్రకటన చేశారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు, సన్‌రైజర్స్ హైదరాబాద్‌ల మధ్య శనివారం సాయంత్రం 7గంటలకు మొదలైంది. అయితే దాదాపు ప్రతీ ఏటా అట్టహాసంగా నిర్వహించే ఐపీఎల్ ఆరంభ వేడుకలను బీసీసీఐ ఈసారి రద్దు చేసింది. 2025, జూన్ 4న ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 11 మంది అభిమానులు చనిపోయారు. దీంతో ఈ విషాదం కారణంగా ఎలాంటి ఆరంభ వేడుకలు లేకుండా ఐపీఎల్ 2026 సీజన్‌ను మొదలెట్టాలని భావించింది. కాగా మే 31న జరిగే ఐపీఎల్ 2026 సీజన్ ఫైనల్ మ్యాచ్ ముందు ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వివరించారు.



## ఇషాన్ కిషన్ భారీ రికార్డు

ఐపీఎల్ 2026 ఆరంభ మ్యాచ్ లోనే ఎస్ఆర్‌హెచ్ తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ కిషన్ భారీ రికార్డు సాధించాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో జరుగుతున్న మ్యాచ్ లో బాధ్యతాయుతంగా ఆడుతున్న అతను.. ఐపీఎల్ లో 3000 పరుగులు పూర్తి చేశాడు.

తద్వారా క్యాష్ లీగ్ చరిత్రలో అత్యంత వేగంగా ఈ మైలురాయిని తాకిన ఆరో భారత ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఇషాన్ ఈ మైలురాయిని చేరుకునేందుకు 2180 బంతులు తీసుకోగా.. రిషబ్ పంత్ (2028), యూసఫ్ పఠాన్ (2082), సూర్యకుమార్ యాదవ్ (2130), సురేశ్ రైనా (2135), ఎంఎస్ ధోని (2152) అతని కంటే వేగంగా ఈ మైలురాయిని చేరుకున్నారు.

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్కు దిగిన ఎస్ఆర్‌హెచ్ కష్టాల్లో పడింది. ఆర్సీబీ అరంగేట్రం పేసర్ జేకబ్ డఫీ నిప్పులు చెరిగే బంతులతో ఎస్ఆర్హెచ్ టాపార్డర్ ను కుప్పకూల్చాడు.

## డిఫెండింగ్ ఛాంపియన్ఆర్సీబీదే తొలివిజయం

ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి దిగిన ఆర్సీబీ విజేతగా నిలిచింది. తొలుత టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 201 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



## గంభీర్ పేరు, ఫొటోలు వాడొద్దు: దిల్లీ హైకోర్టు

తన గుర్తింపు దుర్వినియోగానికి సంబంధించిన కేసులో టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కు దిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. గంభీర్ పేరు, ఫొటో, వాయిస్ లేదా ఏఐ జనరేటెడ్ తో కూడిన వీడియోలను 36 గంటల్లో తొలగించాలని ఆన్ లైన్ ప్లాట్ ఫామ్ లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం తీర్పునిచ్చింది. గంభీర్ తరఫున న్యాయవాదులు పలు సోషల్ మీడియా ఖాతాలను కోర్టు ముందుంచారు. ఆన్ లైన్ లో గంభీర్ గుర్తింపును దుర్వినియోగం చేసినట్లు వాదనలు వినిపించారు.

**తొలగించాల్సిందే..**

గంభీర్ తరఫు వాదనలు విన్న న్యాయస్థానం ఆన్లైన్ ప్లాట్ ఫామ్ కు ఆదేశాలు జారీ చేసింది. ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్, అమెజాన్, ఫ్లిప్కార్ట్ తోపాటు ఇతర సోషల్ మీడియా ఖాతాల్లోని కంటెంట్ ను 36 గంటల్లోనే తొలగించాలని స్పష్టం చేసింది.



మున్ముందు ఇలాంటి అవాంఛిత కంటెంట్ ఆయా ఖాతాల్లో రాకుండా చూడాలని హెచ్చరించింది.

ఉల్లంఘనకు పాల్పడిన బాధ్యుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. భారత ప్రధాన కోచ్ గా ఉన్న గౌతమ్ గంభీర్ తన వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించే హక్కును కాలరాయడం తగదని హైకోర్టు పేర్కొంది.

**పిటిషన్ లో ఏముందంటే?**

దిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన సివిల్ దావాలో గంభీర్ తన వ్యక్తిత్వ పరిరక్షణతోపాటు రూ. 2.5 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అటువంటి డీప్ ఫేక్ కంటెంట్ ను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ''ఇది కేవలం వ్యక్తిత్వ హననం మాత్రమే కాదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తున్న సమయంలో చట్టం, గౌరవానికి సంబంధించిన అంశంగా పరిగణించాలి. నా గుర్తింపు, నా పేరు, నా గొంతుకను ఆయుధాలుగా ఉపయోగించి అనధికారిక ఖాతాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి అవుతోంది. నా పేరు వినియోగించి ఆదాయం ఆర్జించడం జరుగుతోంది'' అని గంభీర్ తెలిపారు.

# పోలీస్ ఫుట్‌బాల్‌లో రాజస్థాన్ గెలుపు..

### జార్ఖండ్‌పై ఎస్ఎస్బీ గోల్స్ సునామీ



పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో శనివారం జరిగిన పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు పై రాజస్థాన్ జట్టు తన ఆధిపత్యాన్ని చాటింది. ఆర్టిలరీ గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్-ఎఫ్ మ్యాచ్‌లో రాజస్థాన్ 3-0 తేడాతో తెలంగాణపై విజయం సాధించింది. ఆరంభం నుంచే వ్యూహాత్మక దాడులతో విరుచుకుపడిన రాజస్థాన్ ఆటగాళ్లు, తెలంగాణ రక్షణ శ్రేణిని ఛేదిస్తూ వరుసగా మూడు గోల్స్ సాధించి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. మరోవైపు శ్రీనిధి ఎఫ్.సి మైదానంలో జరిగిన గ్రూప్-బి పోరులో బి.ఎస్.ఎఫ్ జట్టు 3-0 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌ను ఓడించింది. గ్రూప్-డి లో జరిగిన రసవత్తర పోరులో పంజాబ్‌పై 2-1తో ఉత్తరప్రదేశ్ పైచేయి సాధించింది. అలాగే తమిళనాడుపై కేరళ (2-0), ఉత్తరాఖండ్‌పై మిజోరాం (3-0) జట్లు సునాయాస విజయాలను నమోదు చేశాయి.

**గోల్స్ సునామీః**

మహిళల విభాగంలో ఎస్ ఎస్ బి జట్టు మైదానంలో గోల్స్ సునామీ సృష్టించింది. హైదరాబాద్ ఎఫ్.సి గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఎస్ఎస్బీ ఏకంగా 16-0 తేడాతో జార్ఖండ్ జట్టును మట్టికరిపించి టోర్నీలోనే భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇదే గ్రూపులో జరిగిన మరో మ్యాచ్‌లో సి.ఐ.ఎస్.ఎఫ్ జట్టు 1-0తో సి.ఆర్.పి.ఎఫ్ పై విజయం సాధించింది. అస్సాం రైఫిల్స్ 5-0 స్కోర్‌తో చండీగఢ్ పై, ఐటిబిపి ఆర్పిఎఫ్ పై 2-0 స్కోర్ తోను, జమ్ము కాశ్మీర్ కర్ణాటక పై 2-0 స్కోర్ తో , త్రిపుర మధ్యప్రదేశ్ పై 3-1 స్కోర్ తోను విజయం దక్కించుకున్నాయి.

**నేటి మ్యాచ్‌లు :**

పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా ఆదివారం పలు కీలక లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. పురుషుల విభాగంలో ఉదయం 7 గంటలకు సి.ఐ.ఎస్.ఎఫ్-సిక్కిం, త్రిపుర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య పోరు జరగనుంది. అలాగే ఉదయం 9:30 గంటలకు జార్ఖండ్-మహారాష్ట్ర జట్లు తలపడనుండగా, మధ్యాహ్నం 3:45 గంటలకు మిజోరాం-ఎస్ఎస్బీ, బి.ఎస్.ఎఫ్-మణిపూర్, కేరళ-కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో ఉదయం 7 గంటలకు సి.ఐ.ఎస్.ఎఫ్-జార్ఖండ్, మధ్యాహ్నం 3:45 గంటలకు ఒడిశా-మణిపూర్ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి

# నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' రిలీజ్ డేట్ లాక్

యంగ్ హీరో నాగశౌర్య నటిస్తున్న సరికొత్త యాక్షన్ ఎంటర్ టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్' విడుదలకు సిద్ధమవుతోంది. రామ్ దేసిన ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని, మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఏప్రిల్ 17, 2026న థియేటర్లలోకి రానుంది. త్వరలోనే చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించనుంది. ఈ సినిమాలో నాగశౌర్య సరసన విధి హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి మరియు శ్రీదేవి విజయ్ కుమార్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ తారాగణం ఉండటంతో ఈ ప్రాజెక్ట్ పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సాంకేతిక విభాగం విషయానికి వస్తే, ప్రముఖ సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ ఈ సినిమాతో టాలీవుడ్ లోకి రీ-ఎంట్రీ ఇస్తుండటం విశేషం. రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించగా, రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్ గా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్ గా వ్యవహరిస్తున్నాడు.



# నేను ఇంకాసింగిలే - సాయి పల్లవి

స్టార్ బ్యూటీ సాయి పల్లవి తన పెళ్లి వార్తలపై వస్తున్న రూమర్లకు చెక్ పెట్టింది. ప్రస్తుతం తాను సినిమాలతో ఎంతో బిజీగా ఉన్నానని, ఇప్పట్లో వివాహం చేసుకునే ఆలోచన లేదని ఆమె స్పష్టం చేసింది. ఒక ఈవెంట్ లో పాల్గొన్న సందర్భంగా తన వ్యక్తిగత జీవితం గురించి స్పందిస్తూ, తాను ప్రస్తుతం సింగిల్ గానే ఉన్నానని మరియు తన పూర్తి దృష్టి కెరీర్ పైనే ఉందని వెల్లడించింది. సాయి పల్లవి చెల్లెలు వివాహం జరగడంతో, 33 ఏళ్ల ఈ నటి పెళ్లి గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. అయితే గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ, కేవలం కంటెంట్ ఉన్న చిత్రాలనే ఎంచుకునే ఆమె, ప్రస్తుతం భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ముఖ్యంగా మైథలాజికల్ చిత్రం 'రామాయణ'లో నటిస్తూ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతుంది.

వరుస సినిమాలతో సాయి పల్లవి డైరీ ఫుల్ అయిపోయింది. మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి సరసన నటిస్తున్న చిత్రంతో పాటు, అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన 'ఏక్ దిన్' అనే సినిమాలో కూడా ఆమె నటిస్తుంది. ఈ చిత్రాలు త్వరలోనే విడుదలకు సిద్ధమవుతుండటంతో, అభిమానులు ఆమె నటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## వారిద్దరినీ అన్‌ఫాలో చేసిన రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారారు. 'కాంతార: చాప్టర్-1'తో హిట్ ను సొంతం చేసుకున్న ఆయన.. తాజాగా తన సహనటీనటులను ఇన్ స్టాలో అన్ ఫాలో చేయడం కన్నడ పరిశ్రమలో చర్చకు దారితీసింది. రాజ్ బి శెట్టిలతో పాటు నటి రుక్మిణి వసంత్ ను రిషబ్ అన్ ఫాలో చేశారు. వీరితో పాటు 'కాంతార' వంటి భారీ చిత్రాన్ని నిర్మించిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ 'హోంబలే ఫిల్మ్స్' అధికారిక ఖాతాను కూడా ఆయన అన్ ఫాలో చేశారు. దీంతో కొన్ని రోజులుగా 'కాంతార' టీమ్ లో విభేదాలున్నాయంటూ వస్తోన్న వార్తలకు మరింత బలం చేకూరింది. నిర్మాణసంస్థ హోంబలే ఫిలమ్స్ ను ఆయన అన్ ఫాలో చేసినప్పటికీ, ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ ను మాత్రం రిషబ్ ఇంకా ఫాలో అవుతూనే ఉన్నారు. ఇప్పటివరకు ఈ అంశంపై రిషబ్ శెట్టి కానీ, నిర్మాణసంస్థ కానీ ఎటువంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. మరోవైపు రిషబ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్ జై హనుమాన్' కోసం సిద్ధమవుతున్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన హనుమంతుడి పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే ప్రకటించారు.

# బ్రెజిల్‌లో ఈగ స్పెషల్ స్క్రీనింగ్.. దుమ్ములేపనున్న 'వారణాసి' గ్లింప్స్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి సృష్టించిన విజువల్ వండర్ 'ఈగ' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సందడి చేసేందుకు సిద్ధమైంది. సౌత్ అమెరికాలోని బ్రెజిల్ దేశంలో గల సాల్వడార్ నగరంలో ఈ సినిమా స్పెషల్ స్క్రీనింగ్ జరగనుంది. ఈ రోజు మార్చి 29న ఉదయం 10 గంటల నుండి 'గీగీఐ పనోరమా ఇంటర్నేషనల్ కోయిసా డి సినిమా' వేడుకల్లో భాగంగా సినీ గ్లాబర్ రోచా థియేటర్ లో ఈ స్పెషల్ స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు.

ఈ ప్రదర్శనలో మరో విశేషం ఏమిటంటే, సినిమా ముగిసిన తర్వాత ప్రేక్షకులకు 'వారణాసి' చిత్రానికి సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్ ను ప్రదర్శించనున్నారు. రాజమౌళి సినిమాలకు అంతర్జాతీయంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా, బ్రెజిల్ దేశపు సినీ ప్రియులు ఈ ప్రదర్శన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మన తెలుగు సినిమా ఖండాంతరాలు దాటి దక్షిణ అమెరికాలో ప్రదర్శితం కావడం విశేషం.

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అప్ డేట్ వైరల్ అవుతోంది. గతంలో 'బాహుబలి', 'RRR' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రాజమౌళి, ఇప్పుడు తన పాత చిత్రం 'ఈగ'తో మరోసారి విదేశీ ప్రేక్షకులను పలకరిస్తున్నారు. ఈ స్పెషల్ షో ద్వారా 'వారణాసి' సినిమాపై కూడా భారీ అంచనాలు నెలకొనే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.




# 'బరి'లోకి దిగిన పవన్ కళ్యాణ్..!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన నెక్స్ట్ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించాడు. 'బరి' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు యదు వంశీ దర్శకత్వం వహిస్తున్నాడు. వరుణ్ తేజ్ సోదరి నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం.

ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుక తాజాగా ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసి, చిత్రానికి క్లాప్ కొట్టి షూటింగ్ను ప్రారంభించాడు. బాబాయ్ చేతుల మీదుగా సినిమా ప్రారంభం కావడంతో మెగా అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

ప్రస్తుతం ఈ పూజా కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో సాగే మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్కు సంబంధించిన ఇతర నటీనటులు, టెక్నికల్ డిపార్ట్ మెంట్ వివరాలను చిత్ర యూనిట్ త్వరలోనే వెల్లడించనుంది.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.